DD9 వాస్తవాలు పలుకు
TGTEL/26/A2635
వార్త
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ | సంపుటి: 06 | సంచిక: 127 | 18-09-2026 | శుక్రవారం | పేజీలు: 10 | వెల: 3/-

చరిత్రను ఎవరూ దాచిపెట్టలేరు

తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న కిషన్ రెడ్డి
రజాకార్ల ఘోరాలను గత పాలకులు తొక్కిపెట్టారని మండిపాటు
ఎంఐఎంకు అనుకూలంగా రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని విమర్శ

డీడీ9 వార్త, హైదరాబాద్



సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన 'తెలంగాణ విమోచన దినోత్సవం' వేడుకల్లో భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై విరుచుకుపడ్డారు. తెలంగాణలో రజాకార్లు జరిపిన నరమేధం, ఘోరాలను గత పాలకులు చరిత్ర పుటల నుంచి తొక్కిపెట్టారని మండిపడ్డారు. చరిత్రను ఎంత దాచాలని చూసినా సత్యం దాగిపోదని స్పష్టం చేశారు. ఎంఐఎంకు భయపడే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా మిగతా 2లో..

కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ

భూముల వివరాల సేకరించిన అధికారులు
ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంపై రెవెన్యూ అధికారుల దృష్టి
భూముల వివరాలను సిద్ధం చేస్తున్న అధికారులు
ప్రభుత్వ భూముల సర్వే నంబర్ల సేకరణ
గతంలో భూములు కలిగి ఉన్న రైతుల వివరాలు
ప్రస్తుత రెవెన్యూ రికార్డుల పరిశీలన
నివేదికల రూపంలో వివరాల తయారీ
సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలో ప్రక్రియ
ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి సమీపంలోని భూములపై ఆరా
అసెంబ్లీలో ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించినట్లు వెల్లడి
విచారణ నేపథ్యంలో అధికారుల కసరత్తు

డీడీ9 వార్త, హైదరాబాద్

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్‌కు సంబంధించిన వ్యవసాయ క్షేత్రంపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. వ్యవసాయ క్షేత్రానికి సమీపంలో ఉన్న భూములకు సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన సర్వే నంబర్లు, గతంలో ఆయా భూములను కలిగి ఉన్న రైతుల పేర్లు, ప్రస్తుతం ఉన్న రెవెన్యూ రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ వివరాలను నివేదికల మిగతా 2లో..



మా కుటుంబ ఆస్తులు.. రేవంత్ ఆస్తులపై విచారణకు సిద్ధమా?

కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందనడంపై కేటీఆర్ ఆగ్రహం

మాజీ సీఎంకు ఉన్నది 67 ఎకరాలేనని స్పష్టం
పుట్టుక నుంచి తమ ఆస్తులపై విచారణకు సిద్ధమని ప్రకటన
మీ ఆస్తులపైనా విచారణకు సిద్ధమా అంటూ రేవంత్‌కు సవాల్
సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్

డీడీ9 వార్త, హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ ఆస్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ముఖ్యమంత్రి విషప్రచారం చేస్తున్నారని, ఇందుకు ఆయన తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

కేసీఆర్‌కు ఉన్నది 1,000 ఎకరాలు కాదని, కేవలం 67 ఎకరాలు మాత్రమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రే అసెంబ్లీ వేదికగా అంగీకరించారని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ముఖ్యమంత్రికి ఓ సవాల్ విసిరారు. "కేసీఆర్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు మా కుటుంబం ఆస్తులపై పూర్తిస్థాయి విచారణకు మేము సిద్ధం. మరి పుట్టినప్పటి నుంచి మీ ఆస్తులపై విచారణకు మీరు సిద్ధమా?" అని రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ వ్యవసాయాన్ని ప్రేమించే నిజమైన రైతు అని, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ఆయన సాగు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కొందరు భూమిని ఒక వ్యాపార వస్తువుగా చూస్తే, కేసీఆర్ మాత్రం దానిని ఎంతో పవిత్రంగా భావిస్తారని పేర్కొన్నారు. చట్టబద్ధంగా కొనుగోలు మిగతా 2లో..





మెల్‌బోర్న్‌లో రోడ్డు ప్రమాదం

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
ప్రమాదంలో ఇద్దరు విశాఖవాసులు మృతి
జీటీ ప్రసాద్ కుటుంబంలో విషాదం
శుభకార్యంలో పాల్గొనేందుకు ఆస్ట్రేలియా వెళ్లిన కుటుంబం
ప్రసాద్ భార్య, కోడలు నేహా మృతి
కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
కళ్లెదుటే భార్య, కోడలు మృతి చెందడంతో ప్రసాద్ తీవ్ర దిగ్భ్రాంతి
గతంలో వీడీసీఏలో జాయింట్ సెక్రటరీగా పనిచేసిన ప్రసాద్
ప్రమాద ఘటనతో విశాఖలో విషాదం
సుమారు పది రోజుల తర్వాత మృతదేహాలు విశాఖకు చేరే అవకాశం

డీడీ9 వార్త, నేషనల్‌బ్యూరో

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విశాఖవాసులు మృతి చెందారు. విశాఖకు చెందిన జీటీ ప్రసాద్ తన కుటుంబంతో కలిసి శుభకార్యంలో పాల్గొనేందుకు ఆస్ట్రేలియా వెళ్లారు. మెల్‌బోర్న్‌లో వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో జీటీ ప్రసాద్ భార్య, ఆయన కోడలు నేహా మృతి చెందారు. కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడినట్లు మిగతా 2లో..

యూట్యూబర్ వైష్ణవి భర్త దారుణహత్య

కత్తులతో నరికిచంపిన దుండగులు
నిజామాబాద్‌లో హరిబాబు దారుణ హత్య
ఆర్ఆర్ చౌరస్తా వద్ద నడిరోడ్డుపై దాడి
కారులో వెళ్తుండగా కత్తులతో దాడి
గుర్తుతెలియని వ్యక్తుల దుశ్చర్య
తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి
ఇటీవలే బెయిల్‌పై జైలు నుంచి విడుదల
గతంలో భార్య వైష్ణవి హత్య కేసులో అరెస్టు
వైష్ణవి హత్య కేసులో నిందితుడిగా హరిబాబు
పగతోనే హత్య జరిగి ఉండొచ్చని పోలీసుల అనుమానం
సీసీటీవీ ఆధారంగా నిందితుల కోసం గాలింపు



డీడీ9 వార్త, నేషనల్‌బ్యూరో

నిజామాబాద్‌లో యూట్యూబర్ వైష్ణవి భర్త హరిబాబు దారుణ హత్యకు గురయ్యాడు. ఆర్ఆర్ చౌరస్తా వద్ద కారులో వెళ్తున్న హరిబాబుపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన హరిబాబు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

హరిబాబు గతంలో జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన ప్రముఖ యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. గర్భవతిగా ఉన్న వైష్ణవిని అదనపు కట్నం కోసం 2026 మార్చిలో మిగతా 2లో..

ప్రజల ఆశీర్వాదమే నాకు శ్రీరామరక్ష


76వ పుట్టినరోజు సందర్భంగా వెల్లువెత్తిన శుభాకాంక్షలు
ప్రజల ప్రేమాభిమానాలకు మోదీ కృతజ్ఞతలు
'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమంపై ప్రధాని స్పందన
మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని గుర్తుచేస్తూ ప్రత్యేక గీతం
మోదీ జన్మదినం సందర్భంగా పాట విడుదల
దేశవ్యాప్తంగా 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమానికి బీజేపీ పిలుపు

డీడీ9 వార్త, హైదరాబాద్

ప్రధాని నరేంద్ర మోదీ తన 76వ పుట్టినరోజు సందర్భంగా దేశవ్యాప్తంగా అందుతున్న శుభాకాంక్షలపై స్పందించారు. ప్రజలు చూపుతున్న ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ చేపట్టిన 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమంపై మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందుతున్న ఆశీర్వాదాలు దేశసేవ పట్ల తన సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని గాయని స్నేహా శంకర్, కళాకారుడు అమన్ పంత్ 'ఆశీర్వాద్ కా దియా' ప్రత్యేక గీతాన్ని రూపొందించారు. మోదీ జన్మదినంతో పాటు ఆయన 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని గుర్తుచేస్తూ ఈ పాటను అంకితం చేశారు. దీనిపై స్పందించిన ప్రధాని.. ప్రజల నుంచి లభిస్తున్న ఆశీర్వాదాలు దేశానికి సేవ చేయాలన్న తన నిబద్ధతను మరింత పెంచుతాయని అన్నారు. మోదీ పుట్టినరోజు సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రజలు 'ఆశీర్వాద్ కా దియా' మిగతా 2లో..

ఉద్యమకారులకు అప్పులు .. కేసీఆర్ కుటుంబానికి ఆస్తులు


బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శలు
ఉద్యమకారుల త్యాగాల పునాదులపై ఆస్తులు సంపాదించారని ఆరోపణ
ఉద్యమకారులకు ఆస్తులు తగ్గితే.. కేసీఆర్‌కు లక్షల కోట్ల ఆస్తులు వచ్చాయని వ్యాఖ్య
2004 వరకు కేసీఆర్‌కు ఒక్క ఎకరా భూమి లేదని వెల్లడి
ఎన్నికల అఫిడవిట్‌లోనూ ఇదే విషయాన్ని పేర్కొన్నారని వ్యాఖ్య
ఇప్పుడు కేసీఆర్‌కు వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్న
కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాలు ఉన్నాయన్న కేటీఆర్ వ్యాఖ్యలపై అభ్యంతరం
అఫిడవిట్‌లో తప్పులు రాశారా.. ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారా? అని ప్రశ్న
ఎన్నికల అఫిడవిట్ ద్వారా కల్వకుంట్ల కుటుంబం అడ్డంగా దొరికిందని విమర్శ



డీడీ9 వార్త, హైదరాబాద్

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ ఉద్యమకారులకు అప్పులే మిగిలాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉద్యమకారుల త్యాగాల పునాదులపై కేసీఆర్ కుటుంబం భారీగా ఆస్తులు సంపాదించిందని ఆరోపించారు. ఉద్యమకారుల ఆస్తులు తగ్గిపోయిన సమయంలో కేసీఆర్‌కు మాత్రం లక్షల కోట్ల ఆస్తులు వచ్చాయని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వంపై మిగతా 2లో..

టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్‌కు మరో ఐదేళ్లు



టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ కొనసాగింపు
మరో ఐదేళ్ల పదవీకాలానికి బోర్డు ఆమోదం
ముంబయిలో జరిగిన బోర్డు సమావేశంలో నిర్ణయం
ప్రస్తుత పదవీకాలం ముగిసిన తర్వాత కొనసాగనున్న చంద్రశేఖరన్
ఆగస్టు 12న తప్పుకోవాలనుకుంటున్నట్లు ప్రకటించిన చంద్రశేఖరన్
మారిన పరిస్థితుల నేపథ్యంలో పునర్నియామకానికి నిర్ణయం
ఆర్‌బీఐ నిబంధనలను పరిగణనలోకి తీసుకున్న ఎన్ఆర్‌సీ
పునర్నియామక తీర్మానానికి నోయెల్ టాటా వ్యతిరేకత ఓటు
టాటా సన్స్ ఐపీఓ అంశంపై విభేదాలు
2017 నుంచి టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ సేవలు

డీడీ9 వార్త, నేషనల్‌బ్యూరో


టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పదవీకాలాన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తూ సంస్థ బోర్డు నిర్ణయం తీసుకుంది. గురువారం ముంబయిలోని బాంబే హౌస్‌లో జరిగిన టాటా సన్స్ బోర్డు సమావేశంలో ఈ మేరకు ఆమోదం తెలిపింది.

ఈ ఏడాది ఆగస్టు 12న చంద్రశేఖరన్ తన ప్రస్తుత పదవీకాలం పూర్తయిన మిగతా 2లో..

సెప్టెంబర్ 17పై కాంగ్రెస్, బీజేపీవన్నీ అబద్ధాలే..

సెప్టెంబర్ 17 సందర్భంగా జెండా ఆవిష్కరించిన కవిత
తెలంగాణ పోరాట స్ఫూర్తిని గుర్తుచేసిన తెలంగాణ రక్షణ సేన అధినేత్రి
కాంగ్రెస్, బీజేపీలపై కవిత విమర్శలు
విలీన చరిత్రను వక్రీకరిస్తున్నాయని ఆరోపణ
మతాలకు అతీతంగా ప్రజలు పోరాడారని వెల్లడి

డీడీ9 వార్త, హైదరాబాద్



తెలంగాణ విలీన పోరాట యోధుల స్ఫూర్తితో రాష్ట్రంలో రాజ్యమేలుతున్న అరాచక శక్తులను గద్దె దించుతామని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని బంజారా హిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 అనేది తెలంగాణ పౌరుషానికి, పోరాట పటిమకు మరియు త్యాగాల చరిత్రకు నిదర్శనం అన్నారు. అయితే ఈ చారిత్రక రోజుపై కాంగ్రెస్, బీజేపీలు మిగతా 2లో..

ఉద్యమకారులకు అప్పులు .. కేసీఆర్ కుటుంబానికి ఆస్తులు

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన విమర్శలకు పొంగులేటి ఈ మేరకు స్పందించారు.

2004 వరకు కేసీఆర్‌కు ఒక్క ఎకరా భూమి కూడా లేదని పొంగులేటి పేర్కొన్నారు. ఈ విషయాన్ని కేసీఆర్ స్వయంగా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారని తెలిపారు. ప్రస్తుతం కేసీఆర్‌కు వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్ ద్వారా కల్వకుంట్ల కుటుంబం అడ్డంగా దొరికిపోయిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల భూమి ఉన్న వ్యక్తి అని కేటీఆర్ చెబుతున్నారని పొంగులేటి అన్నారు. అదే నిజమైతే ఎన్నికల అఫిడవిట్‌లో కేసీఆర్ తన ఆస్తుల వివరాలను తప్పుగా నమోదు చేశారా? లేక ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారా? అని ప్రశ్నించారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలను ప్రస్తావిస్తూ.. వారి త్యాగాల పునాదులపై రూ.లక్షల కోట్ల ఆస్తులు సంపాదించారని పొంగులేటి ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యమకారులకు ఆర్థికంగా ప్రయోజనం కలగలేదని, అప్పులే మిగిలాయని విమర్శించారు.



మెల్‌బోర్న్‌లో రోడ్డు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి

సమాచారం. తన కళ్లెదుటే భార్య, కోడలు ప్రమాదంలో మృతి చెందడంతో ప్రసాద్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

జీటీ ప్రసాద్ గతంలో విశాఖ జిల్లా క్రికెట్ సంఘం (వీడీసీఏ)లో జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. ఆయన కుటుంబంలో చోటుచేసుకున్న విషాద ఘటనతో విశాఖలోని బంధువులు, సన్నిహితుల్లో విషాదం నెలకొంది.

ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం.

మా కుటుంబ ఆస్తులు.. రేవంత్ ఆస్తులపై విచారణకు సిద్ధమా?

మొదటిపేజీ తరువాయి

చేసిన భూములపై అనవసర రాద్ధాంతం చేస్తూ రేవంత్ రెడ్డి 'సెల్ఫ్ గోల్' చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు.

కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల ఆస్తి ఉండేదని, చింతమడకలోని తమ పాత ఇంటిని ప్రభుత్వ పాఠశాల కోసం విరాళంగా ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. 22ఏ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగడతామని ఆయన పునరుద్ఘాటించారు.

కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ

మొదటిపేజీ తరువాయి

రూపంలో సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించినట్లు పేర్కొంటున్న నేపథ్యంలో అధికారులు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంపై దృష్టి సారించారు. ఈ క్రమంలో భూములకు సంబంధించిన పాత, ప్రస్తుత రికార్డులను సేకరించే ప్రక్రియ కొనసాగుతోంది.

యూట్యూబర్ వైష్ణవి భర్త దారుణహత్య

మొదటిపేజీ తరువాయి

కత్తితో పొడిచి హత్య చేసినట్లు అతడిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో పోలీసులు హరిబాబును అరెస్టు చేసి జైలుకు పంపించారు.ఇటీవల హరిబాబు కోర్టు నుంచి బెయిల్ పొందడంతో జైలు నుంచి బయటకు వచ్చాడు. బెయిల్‌పై ఉన్న సమయంలోనే ఆర్ఆర్ చౌరస్తా వద్ద గుర్తు తెలియని దుండగులు అతడిపై కత్తులతో దాడి చేసి హతమార్చారు.

భార్య వైష్ణవిని హత్య చేసినందుకు పగతోనే ఆమె కుటుంబ సభ్యులు లేదా బంధువులు హరిబాబును హత్య చేసి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్న పోలీసులు.. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.

టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్‌కు మరో ఐదేళ్లు

మొదటిపేజీ తరువాయి

తర్వాత మూడోసారి ఛైర్మన్‌గా కొనసాగాలనే ఉద్దేశం లేదని ప్రకటించారు. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలు, మారిన పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న నామినేషన్ అండ్ రెమ్యూనరేషన్ కమిటీ (ఎన్ఆర్‌సీ) ఆయనను మరోసారి బాధ్యతలు స్వీకరించాల్సిందిగా కోరింది.

చంద్రశేఖరన్ పునర్నియామకానికి సంబంధించిన తీర్మానంపై టాటా ట్రస్ట్స్ ఛైర్మన్, టాటా సన్స్ బోర్డు డైరెక్టర్ నోయెల్ టాటా మాత్రమే వ్యతిరేకంగా ఓటు వేసినట్లు ఫైల్లోని సమాచారం పేర్కొంది.

టాటా సన్స్ కంపెనీని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయడంపై కూడా భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు సమాచారం. నోయెల్ టాటా ఐపీఓను వ్యతిరేకిస్తుండగా.. టాటా సన్స్‌లో దాదాపు 18 శాతం వాటా ఉన్న షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ కంపెనీ లిస్టింగ్‌కు అనుకూలంగా ఉన్నట్లు పేర్కొంది.

2017 నుంచి టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ సేవలందిస్తున్నారు. ఆయన నాయకత్వంలో టాటా గ్రూప్ మరింత విస్తరించిందని, బోర్డులో మెజారిటీ సభ్యులు ఆయన కొనసాగింపునకు మద్దతు తెలిపినట్లు ఫైల్లో పేర్కొన్నారు.

ప్రజల ఆశీర్వాదమే నాకు శ్రీరామరక్ష

మొదటిపేజీ తరువాయి

కార్యక్రమాన్ని నిర్వహించాలని బీజేపీ పిలుపునిచ్చింది. సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల మధ్య ఇళ్లలో దీపాలు వెలిగించి ప్రధాని ఆయురారోగ్యాలు, విజయాన్ని ఆకాంక్షించాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విజ్ఞప్తి చేశారు. ప్రజాసేవే దేశసేవ అనే సూత్రంతో మోదీ పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా.. మోదీ పుట్టినరోజు సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్' పేరుతో నెల రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని బీజేపీ చేపట్టింది. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. రక్తదాన శిబిరాలు, పరిశుభ్రత కార్యక్రమాలు, ప్రదర్శనలు, సదస్సులు, ప్రజా సంబంధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఫైల్లో పేర్కొన్నారు.

చరిత్రను ఎవరూ దాచిపెట్టలేరు

మొదటిపేజీ తరువాయి

నిర్వహించడానికి వెనుకాడాయని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం ఎంఐఎంకు అనుకూలంగా ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా నిజాం పాలకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పొగడటాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "నిజాం నిజంగానే మంచివాడైతే తెలంగాణ విమోచన కోసం సాయుధ పోరాటాలు ఎందుకు చేయాల్సి వచ్చింది? 'ఆపరేషన్ పోలో' ఎందుకు చేపట్టాల్సి వచ్చింది?" అని నిలదీశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ఈ తరహా ఓటు బ్యాంక్ రాజకీయాలకు రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



సెప్టెంబర్ 17 పై కాంగ్రెస్, బీజేపీవన్నీ అబద్ధాలే..

మొదటిపేజీ తరువాయి

తమ రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

కాంగ్రెస్, బీజేపీలపై ఘాటు విమర్శలు:

సెప్టెంబర్ 17 చరిత్రను కాంగ్రెస్, బీజేపీలు వక్రీకరిస్తున్నాయని కవిత విమర్శించారు. బ్రిటీష్ కాంగ్రెస్ పోరాటం వల్లే తెలంగాణ విలీనమైందని సీఎం అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. నిజానికి సంస్థానాల్లో పోరాటం చేయడం తమ విధానం కాదని నాడు గాంధీజీ అన్నారని కవిత గుర్తుచేశారు. నిజాం సర్కార్ పేదలకు ఇచ్చిన 10 లక్షల ఎకరాల భూమిని, భారత యూనియన్‌లో కలిశాక తిరిగి జమీందార్లకు అప్పగించిందే కాంగ్రెస్ అని ఆరోపించారు. ఇక ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటమని బీజేపీ మత రంగు పులిమే ప్రయత్నం చేస్తోందని కవిత ధ్వజమెత్తారు. ఆనాటి పోరాటంలో అసలు బీజేపీ, ఆర్ఎస్ఎస్ లేనే లేవని స్పష్టం చేశారు.

ప్రజలే తుపాకీ పట్టి పోరాడారు:

ఆనాటి జాగీర్‌దార్లు, జమీందార్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా మతాలకు అతీతంగా ప్రజలే స్వచ్ఛందంగా పోరాడారని కవిత తెలిపారు. వట్టికోట ఆళ్వార్ స్వామి, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి లాంటి మహనీయులు సైకిళ్లపై తిరుగుతూ ప్రజల్లో చైతన్యం నింపారని గుర్తుచేశారు. కాళోజీ, దాశరథి, షోయాబుల్లాఖాన్, మగ్దూం మొయినోద్దీన్ వంటి కవులు, రచయితలు సమరశంఖం పూరించారని కొనియాడారు. వారి చైతన్యంతోనే దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, మల్లు స్వరాజ్యం, అరుట్ల కమలాదేవి లాంటి వీరులు ఉద్భవించారని పేర్కొన్నారు. నాడు మహనీయులు చూపిన పోరాట స్ఫూర్తితోనే, ప్రస్తుతం కులమతాలకు అతీతంగా ప్రజల హక్కులను కాపాడేందుకు తెలంగాణ రక్షణ సేన ముందుకు వచ్చిందని, అరాచక పాలనకు అంతం పలికే వరకు పోరాటం కొనసాగుతుందని కవిత అన్నారు.



ప్రభుత్వాసుపత్రిలో ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డీడీ9 వార్త) :

బోధన్ పట్టణంలోని గాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేసి వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన శిబిరంలో యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ప్రజాసేవలో ప్రధాని చూపుతున్న చొరవ అందరికీ ఆదర్శమని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు నాగేశ్వరరావు, అధ్యక్షులు గాండ్ల నాగరాజ్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఐటీ సెల్ బాధ్యులు సందీప్, కోశాధికారి పి.సురేష్, ఉపాధ్యక్షులు బి.సాయిలు, కార్యవర్గ సభ్యులు తేలి సురేష్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

పాలనలో ప్రజా భాగస్వామ్యం ముఖ్యం : ఆర్‌డీవో, ఛైర్‌పర్సన్

- **-బోధన్‌లో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం**

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డీడీ9 వార్త) :

ప్రజాస్వామ్య హక్కులను కాపాడుతూ, ప్రజలందరికీ సమాన అవకాశాలు, పాలనా ఫలాలు అందించడమే లక్ష్యమని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. గురువారం ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా బోధన్ ఆర్‌డీవో కార్యాలయంలో ఆర్‌డీవో యం.విజయకుమారి జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. బోధన్ మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ ఛైర్‌పర్సన్ తూము పద్మ జెండాను ఎగురవేసి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించడమే ప్రజా పాలన ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పట్టణ సమగ్రాభివృద్ధికి పాలకవర్గం, అధికారులు కలిసికట్టుగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణ జాదవ్, ఫ్లోర్ లీడర్ శరత్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.



భూ వివాదాలకు భూ రీ-సర్వేతో శాశ్వత పరిష్కారం : ఆర్‌డీవో విజయ కుమారి

- **బండారుపల్లి, ఖాజాపూర్ గ్రామసభల్లో రైతులతో ముఖాముఖి**

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డీడీ9 వార్త) :

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని బోధన్ రెవెన్యూ డివిజినల్ అధికారిణి యం.విజయ కుమారి స్పష్టం చేశారు. గురువారం బోధన్ మండలం బండారుపల్లి, సాలూర మండలం ఖాజాపూర్ గ్రామాల్లో నిర్వహించిన రీసర్వే ప్రత్యేక గ్రామసభల్లో ఆమె పాల్గొని దిశా నిర్దేశం చేశారు. బండారుపల్లి పాఠశాల వేదికగా ఉదయం, ఖాజాపూర్‌లో మధ్యాహ్నం జరిగిన సభల్లో ఆర్‌డీవో రైతులతో నేరుగా ముఖాముఖి నిర్వహించారు. భూ సర్వేల నిర్వహణ తీరుపై పూర్తిస్థాయి అవగాహన కల్పించడంతో పాటు, రైతులు అడిగిన ప్రశ్నలకు తగిన సమాధానాలు ఇచ్చి నివృత్తి చేశారు. ప్రతి ఎకరా సరిహద్దులను పక్కాగా నమోదు చేసి, భూ వివాదాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ముగ్గురు డివిజన్ల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారులు, స్థానిక తహసీల్దార్లు విట్టల్, అజ్మత్ నవాజ్, సర్వేయర్లు శ్రావణ్, శివరాజ్, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.





అక్రమ కల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులు : ఏడు షాపులు సీజ్

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డీడీ9 వార్త) :

బోధన్, ఎడపల్లి మండలాల పరిధిలో అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న అక్రమ కల్లు దుకాణాలపై ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ జీవన్ రెడ్డి తెలిపారు. ఊట్పల్లి మాజీ కోఆప్షన్ సభ్యుడు దియావత్ సంతోష్ కుమార్ ద్వారా అక్రమ కల్లు దుకాణాలపై జిల్లా ఎక్సైజ్ కమిషనర్‌కు ఫిర్యాదు అందింది. స్పందించిన కమిషనర్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ సీఐ సూచనలతో ఎస్ఐ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలోని అధికారులు బోధన్, ఎడపల్లి మండలాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. అనుమతులు ఒకచోట పొంది, దుకాణాలను మరొకచోట నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. దీంతో అనుమతులు లేని దాదాపు ఏడు కల్లు దుకాణాలను అధికారులు తక్షణమే సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ



జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా కల్లు విక్రయాలు జరిపితే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ దుకాణ నిర్వాహకులతో పాటు, వారికి అట్టి కల్లును పంపిణీ చేస్తున్న కల్లు గీత లైసెన్స్‌దారులపై కూడా చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రతీ దుకాణ యజమాని ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

ఖాజాపూర్‌లో ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డీడీ9 వార్త) :

భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సాలూర మండలం ఖాజాపూర్ గ్రామంలో బీజేపీ నాయకులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం స్థానిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్కులు, పెన్నులు, అరటిపండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాలూర బీజేపీ మండల అధ్యక్షుడు రావుబా గంగాధర్ మాట్లాడుతూ.. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, సామాన్య ప్రజల ఆశయాలకు అంకితమైన గొప్ప నాయకుడు ప్రధాని మోదీ అని కొనియాడారు. ఆయన నాయకత్వం మరింత బలపడి దేశానికి మరిన్ని విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు. సాలూర మండల బీజేపీ తరఫున ప్రధానికి ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ముట్టెన్ ప్రకాష్, శ్రీను, గ్రామ సర్పంచ్ నాగయ్య, ఉపసర్పంచ్ ఇక్షేపు శ్రీను, ఇంటెనక సాయిలు, సీహెచ్ రమాకాంత్, సీహెచ్ శ్రీను, బాలాజీ, లక్ష్మప్ప, హనుమంతు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



సాయుధ పోరాట స్ఫూర్తితో పోరాడాలి: పీడీఎస్‌యూ

- **-సెప్టెంబర్ 17 విద్రోహ దినమే.. రాజేశ్వర్ స్పష్టీకరణ**

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డిడి9 వార్త) :

తెలంగాణ ప్రజలకు సెప్టెంబర్ 17వ తేదీ ముమ్మాటికీ విద్రోహ దినమేనని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ స్పష్టం చేశారు. బోధన్ పట్టణంలోని మధుమలంచ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ బోధన్ డివిజన్ ఆధ్వర్యంలో "1948 సెప్టెంబర్ 17 విద్రోహ దినం"పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. దొరలు, భూస్వాములు, పటేల్‌పట్వారీల అకృత్యాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాయుధ పోరాటం చేసి భూములు సాధించుకున్నారని తెలిపారు. నాటి నిజాం, రజాకార్ల దౌర్జన్యాలను తరిమికొట్టిన కమ్యూనిస్టులను.. భారత యూనియన్ సైన్యాలు ఊచకోత కోశాయని మండిపడ్డారు. నాటి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో నేడు విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్. కార్తీక్, బోధన్ డివిజన్ నాయకులు సాయినాథ్, నిఖిల్, సాయి కిరణ్, వంశీ, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.



గణేష్ నిమజ్జనానికి ముమ్మర ఏర్పాట్లు

బీర్కూర్, సెప్టెంబర్ 17(డిడి9 వార్త):

గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.ఇందులో భాగంగా బీర్కూర్‌లో నిమజ్జన మార్గాలు, ప్రధాన రహదారులు, నిమజ్జన చెరువు వద్ద చేపడుతున్న ఏర్పాట్లను తహసీల్దార్ సవాయి సింగ్, ఎస్సై వి.కె. రాములు, సర్పంచ్ అరిగే ధర్మతేజ, నాయకులు పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్, పారిశుధ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.ఈ కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు, నాయకులు, ప్రజలు ఉన్నారు.



సాలూరలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

- **వివిధ కార్యాలయాల్లో మువ్వన్నెల జెండా ఆవిష్కరణ**

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డిడి9 వార్త) :

సాలూర మండల కేంద్రంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రభుత్వ, సహకార కార్యాలయాల వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాను ఆవిష్కరించి, గీతాలాపన చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అజ్మత్ నవాజ్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నర్సయ్య జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ సొక్కం లావణ్య, రైతు వేదిక వద్ద వ్యవసాయాధికారి శ్వేత, పిఎసిఎస్ కార్యాలయం వద్ద చైర్మన్ అల్లే జనార్ధన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా సుపరిపాలన అందించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఫతేపూర్‌లో ఘనంగా 'ప్రజా పాలన దినోత్సవం'

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డిడి9 వార్త) :



సాలూర మండలం ఫతేపూర్ గ్రామంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ షేక్ నూర్ అహ్మద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ షేక్ నూర్ అహ్మద్ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమానికి, గ్రామాభివృద్ధికి ప్రజా పాలన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో గ్రామంలోని ప్రతి పౌరుడికీ ప్రభుత్వ ఫలాలు అందేలా పారదర్శక పాలన అందిస్తున్నామని తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోసిన్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి నాగరాజ్, గ్రామస్థులు పాల్గొన్నారు.





అంబేద్కర్‌పై వ్యాఖ్యలకు నిరసన

- **హమారా ప్రసాద్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి: కాదెపురం గంగన్న**

కామారెడ్డి, సెప్టెంబర్ 17(డిడి9 వార్త):


భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్. అంబేద్కర్‌పై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ హమారా ప్రసాద్‌కు వ్యతిరేకంగా గురువారం బీర్కూర్ మండల కేంద్రంలో నిరసన చేపట్టారు.తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాదేపురం గంగన్న ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం బీర్కూర్-బాన్సువాడ ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.
ఈ సందర్భంగా గంగన్న మాట్లాడుతూ.. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను హమారా ప్రసాద్ వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచ మేధావిగా, భారత రాజ్యాంగ నిర్మాతగా అంబేద్కర్‌కు ఉన్న చారిత్రక ప్రాధాన్యతను గుర్తించాలని అన్నారు. అంబేద్కర్‌పై విమర్శలు చేయడం అవివేకమని పేర్కొన్నారు. హమారా ప్రసాద్ వెనుక ఉన్న శక్తులను ప్రభుత్వం బహిర్గతం చేయాలని, అంబేద్కర్‌తో పాటు మహనీయులపై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గంగన్న డిమాండ్ చేశారు. అంబేద్కర్ అభిమానులు, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.కార్యక్రమంలో బాలకృష్ణ, కుర్రి కృష్ణ, ప్రవీణ్ గౌడ్, వెండి యాదవరావు, కొరిమె రఘు, బంగారు రవి, నల్లజెరు బాలరాజు, మెక్క రమేష్, లింగమయ్య, పట్వారి గంగారాం, నీరడి రాములు, బోయి చిన్న సాయిలు, పిడుగు బసంత్, మెక్క శివరాజ్, శంకర్, సాయిలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ జన్మదిన వేడుకలు.. రోగులకు పండ్ల పంపిణీ

- **మోదీ జన్మదిన వేడుకలు.. రోగులకు పండ్ల పంపిణీ**

బీర్కూర్, సెప్టెంబర్ 17(డిడి9 వార్త):

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీర్కూర్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. దేశ సేవ, ప్రజా సంక్షేమం, జాతీయ సమైక్యతకు ప్రాధాన్యం ఇస్తూ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లెల యోగేశ్వర్, మండల ఉపాధ్యక్షుడు హనుమాన్లు, సీనియర్ నాయకులు లక్కపల్లి పోచుగోండ, మేత్రి సాయిలు, సాయిబాబా, రాజేష్, పండరి, ప్రవీణ్, సహదేవ్, గజేందర్, బసవరాజ్, శ్రావణ్, బలరాం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన సర్పంచ్

బీర్కూర్, సెప్టెంబర్ 17(డిడి9 వార్త):

బీర్కూర్ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ అరిగే ధర్మతేజ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, సరుకుల నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించి విద్యార్థులతో భోజనం నాణ్యతపై మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.అయన వెంట ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు, నాయకులు కుర్రి కృష్ణా, రాజు ఉన్నారు.



ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి ఓటూ అమూల్యమైనదే

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డిడి9 వార్త) :

ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడటమే తమ ప్రధాన ధ్యేయమని బోధన్ 1వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మీరామ్మూర్తి స్పష్టం చేశారు. బోధన్ పట్టణ పరిధిలోని ఆచన్‌పల్లి గ్రామా పంచాయతీలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ నోటీసుల విచారణ కొనసాగుతోంది. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ లక్ష్మీరామ్మూర్తి, స్థానిక నాయకుడు సురేందర్‌గౌడ్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి నోటీసుల విచారణ విధానాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ లక్ష్మీరామ్మూర్తి మాట్లాడుతూ.. "ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుడికి ఓటు హక్కు అత్యంత ప్రాధాన్యమైనది. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు భద్రంగా ఉండేలా చూడటానికే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ సవరణ నోటీసుల విచారణ ప్రక్రియ జరుగుతోందని, నోటీసులు అందుకున్న నివాసితులు ఎలాంటి ఆందోళనకు, అసత్య ప్రచారాలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. అధికారులు అడిగిన ఆధారాలను అందించి తమ ఓటును పదిలం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా నోటీసులు అందేలా చూడాలని అధికారులను, బి.ఎల్.వోలను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

- **బోధన్‌లో దళిత నాయకుల నిరసన.. దిష్టిబొమ్మ దగ్ధం**

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డిడి9 వార్త) :

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై చట్టపరంగా తీవ్ర చర్యలు తీసుకోవాలని బోధన్ డివిజన్ దళిత నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బోధన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి బారీ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాతను, మహనీయుడిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమని మండిపడ్డారు. దేశంలో సామాజిక సామరస్య దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న హమారా ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌కు ర్యాలీగా వెళ్లిన నాయకులు, సీఐ వెంకటనారాయణకు ఫిర్యాదుతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రేకం దాస్, ప్రధాన కార్యదర్శి మీర్జా పూర్ బాలరాజు, హరిజన సంఘం అధ్యక్షుడు పెర్కా స్వామి, నాయకులు పల్నాటి యాదగిరి, బాలకృష్ణ, రాజు, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, భాస్కర్, అశోక్, శ్రీకాంత్, మారుతీ, రాములు, సూర్యకాంత్, వసంత్ కంబ్లె, రవీందర్ బాబు, దిలీప్, రమేష్, సంజీవ్, గంగాధర్, సాయిలు, మీర్జాపురం చిన్న సాయన్న తదితరులు పాల్గొన్నారు.



మహాత్మజ్యోతి బాపులే కళాశాలకు రూ.25 వేల విలువైన సిమెంట్ బెంచీలు వితరణ

బాన్సువాడ, సెప్టెంబర్ 17(డిడి9 వార్త):

బీర్కూర్ మండల కేంద్రంలోని మహాత్మజ్యోతి బాపులే పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు కూర్చునేందుకు బెంచీలు అవసరమని పాఠశాల తరఫున ప్రిన్సిపాల్ గోపీచంద్ లయన్స్ క్లబ్ సభ్యులను కోరగా, వెంటనే స్పందించిన లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ సీతలే రమేష్ సహకారంతో పాఠశాలకు సిమెంట్ బెంచీలు అందజేశారు.పాఠశాలలో బెంచీలు అవసరమని తెలియజేయగానే సీతలే రమేష్ తాను బెంచీలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.అదే విధంగా నిజామాబాద్‌లోని బృందావన్ హాస్పిటల్ యాజమాన్యాన్ని సంప్రదించగా, వారు కూడా సహకరించేందుకు ముందుకు వచ్చారు.ఇచ్చిన మాట ప్రకారం బృందావన్ హాస్పిటల్ సహకారంతో బోధన్ నుంచి సుమారు రూ.25 వేల విలువైన 5 సిమెంట్ బెంచీలను పాఠశాలకు తీసుకువచ్చి అందజేశారు.దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులకు కూర్చునేందుకు సౌకర్యం కలగనుంది.ఈ సందర్భంగా సహకారం అందించిన లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ సీతలే రమేష్, నిజామాబాద్ బృందావన్ హాస్పిటల్ యాజమాన్యం, బీర్కూర్ లయన్స్ క్లబ్ సభ్యులకు పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థుల సౌకర్యాల కోసం ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు.



ఈవ్‌టీజర్ల ఆటకట్టించేందుకు షీ టీంకు ఫిర్యాదు చేయండి

- **ఆర్మూర్ సబ్ డివిజన్ షీ టీం**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డిడి9 వార్త) :

సమాజంలో మహిళలు, విద్యార్థినులపై జరిగే ఈవ్‌టీజింగ్, సైబర్ వేధింపుల నివారణకు షీ టీమ్స్ నిరంతరం కృషి చేస్తున్నాయని ఆర్మూర్ సబ్ డివిజన్ షీ టీం కానిస్టేబుళ్లు విగ్నేష్, సుకన్య తెలిపారు. గురువారం పన్నెల్ (బి) జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేధింపులకు గురయ్యే వారు భయం వీడి షీ టీమ్స్ హెల్ప్‌లైన్ నంబర్ 8712659795 లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని, క్యూఆర్ కోడ్ ద్వారా కూడా సులువుగా పిటిషన్ నమోదు చేయవచ్చని చెప్పారు. బాధితుల వివరాలు పూర్తి గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం డి. సురేందర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ఆత్మగౌరవం, సాధికారతే ప్రధానం: ఎంపీ అర్వింద్

- -రూ.2.10 కోట్ల కేంద్ర నిధులతో 19 రకాల పరికరాల పంపిణీ
- -ప్రధాని మోదీ జన్మదిన పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డీడీ9 వార్త) :

దివ్యాంగులు, వయోవృద్ధులకు సానుభూతి చూపడం కంటే వారికి అవకాశాలు కల్పించి, ఆత్మగౌరవాన్ని పెంచడమే దివ్యాంగుల సాధికారతకు నిజమైన అర్థమని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని 'సేవా దినం' సందర్భంగా గురువారం దివ్యాంగులకు సహాయక పరికరాల అందజేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2.10 కోట్ల భారీ నిధులను మంజూరు చేయించి, దాదాపు 1000 మంది లబ్ధిదారులకు 19 రకాల సహాయక పరికరాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సహాయం అందించిన కేంద్ర మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఆర్మూర్, బోధన్, జగిత్యాల, కోరుట్ల, నిజామాబాద్ నార్త్ పరిధిలో ఇప్పటికే సుమారు వెయ్యి మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని, ఇంకా మిగిలి ఉన్న అర్హులను సైతం గుర్తించే ప్రక్రియ సాగుతోందని చెప్పారు. గ్రామాల్లో చివరి దివ్యాంగుడి వరకు ఈ ఫలాలు అందాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.






ప్రయోగపూర్వక బోధనతోనే శాశ్వత జ్ఞానం: విద్యావేత్త మేకల లక్ష్మణ్

- కేర్ డిగ్రీ కళాశాలలో ఆకట్టుకున్న జంతుశాస్త్ర ఎగ్జిబిషన్

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డీడీ9 వార్త) :

విద్యార్థులకు నిత్యం పుస్తకాల చదువుతో పాటు ప్రయోగపూర్వకమైన కార్యక్రమాలు చేపడితే ఆ విషయ పరిజ్ఞానం జీవితాంతం జ్ఞాపకముంటుందని బస్సల్ కళాశాల డైరెక్టర్ మేకల లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు. నిజామాబాద్‌లోని కేర్ డిగ్రీ కళాశాలలో బీజెడ్సీ ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థుల చేత జంతుశాస్త్ర అధ్యాపకురాలు కుమారి ఆస్మా నేతృత్వంలో ఏర్పాటు చేసిన జంతుశాస్త్ర ప్రయోగ ప్రదర్శనను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులలో నైపుణ్యాన్ని వెలికితీసేలా కార్యక్రమం ఏర్పాటు చేసిన కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు 15 రోజులు శ్రమించి ఈ సైన్స్ మోడల్స్ తయారు చేశారన్నారు. నిజామాబాద్ నగరంలోని వివిధ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించి జంతుశాస్త్ర వివరాలు తెలుసుకున్నారని ప్రిన్సిపల్ గోరంట్యాల నరేష్ తెలిపారు. ఈ ప్రదర్శనలో కళాశాల ప్రతినిధులు శంకర్, సందేశ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



జిల్లా కలెక్టరేట్‌లో భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలు

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డీడీ9 వార్త) :

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ ఐడీఓసీ కార్యాలయంలో భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్ భుజంగరావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరిత గతిన పరిష్కరిస్తామని చెప్పారు. ఈ వేడుకల్లో డీఆర్ఓ గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ఇతర శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




పర్కిబండ లో ప్రజా పాలన దినోత్సవం

డీడీ9 వార్త, మనోహరాబాద్ :

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పర్కిబండ గ్రామపంచాయతీ ఆవరణలో ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో పర్కిబండ సర్పంచ్ ఠాకూర్ మోతి భాయి లక్ష్మణ్ సింగ్ , ఉప సర్పంచ్ నిమ్మల మహేష్ , పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, యువత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





గణేశ్ మండపాలకు జియో ట్యాగింగ్ నిఘా

- -పటిష్ఠ బందోబస్తు మధ్య నిమజ్జన వేడుకలు: సీపీ పి. సాయిచైతన్య
- -కమీషనరేట్ వ్యాప్తంగా 5,681 విగ్రహాల ఏర్పాటు

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డీడీ9 వార్త) :

నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ వ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య తెలిపారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలో ఏర్పాటు చేసిన ప్రతీ గణేశ్ మండపానికి పోలీసులు కంటికి రెప్పలా రక్షణ కల్పిస్తున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కమీషనరేట్ పరిధిలో మొత్తం 5,681 గణేశ్ విగ్రహాలను నెలకొల్పగా, నిజామాబాద్ డివిజన్ పరిధిలో 2,545, ఆర్మూర్ డివిజన్‌లో 1,959, బోధన్ డివిజన్ పరిధిలో 1,177 విగ్రహాలు ఉన్నాయని తెలిపారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా నిర్వాహకులు పోలీస్ స్టేషన్లకు రాకుండా ఆన్‌లైన్ ద్వారానే అనుమతులు మంజూరు చేశామన్నారు. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బ్లూకోర్ట్స్ సిబ్బంది క్షేత్రస్థాయిలో ట్యాబ్‌ల ద్వారా ప్రతీ మండపాన్ని సందర్శించి 100% జియో ట్యాగింగ్ ప్రక్రియను పూర్తి చేశారన్నారు. నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో ఐపీ టెక్నాలజీతో కూడిన 100కు పైగా సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించి 24 గంటల పాటు పర్యవేక్షిస్తున్నట్లు సీపీ వివరించారు.



పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా 'ప్రజా పాలన దినోత్సవం'

- జాతీయ జెండాను ఆవిష్కరించిన సీపీ సాయిచైతన్య
- విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డీడీ9 వార్త) :

తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. అనంతరం సీపీ సాయిచైతన్య పోలీస్ లైన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వీట్ ప్యాకెట్లు, నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు, సేవలు అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్.శుభం ప్రకాష్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, ఏఆర్ ఏసీపీ కృష్ణ, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలతో పాటు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, ఐటీ కోర్, సైబర్ క్రైమ్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.





అవగాహనతోనే హెచ్ఐవీ నివారణ

- కళాజాత బృందాల ప్రచారాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్ భుజంగరావు
- వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డీడీ9 వార్త) :

అవగాహన ద్వారానే హెచ్ఐవీ వ్యాప్తిని సమర్థంగా నివారించవచ్చని నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ భుజంగరావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కళాజాత ప్రచార బృందాల కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పల్లె సుద్దుల వంటి జానపద, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు విషయాలు సులభంగా, త్వరితగతిన అర్థమవుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా వారం రోజుల పాటు రోజుకు రెండు ప్రదర్శనల చొప్పున ఈ కళాజాత షోలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రచారంలో యువతను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భార్గవి, డిపిఎం సుధాకర్, సిఎస్వో నవీన్, సహాయోగి సమత, జనం పాట కళాబృందం సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెంచాలి

- -వైద్యాధికారుల సమీక్షలో ట్రైనీ కలెక్టర్ సురేష్ పామూరి

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 17(డీడీ9 వార్త) :

ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ట్రైనీ కలెక్టర్ సురేష్ పామూరి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్యాధికారులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ జవాబుదారీతనంతో పనిచేయాలని స్పష్టం చేశారు. మన పరిధిలో కాపాడగలిగే ప్రతి ప్రాణాన్ని కాపాడాలని, మాతా శిశు మరణాలను అడ్డుకోవడానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతిరోజు తప్పనిసరిగా గృహ సందర్శనలు చేయాలని, రోగ నిర్ధారణ శిబిరాలను తరచుగా నిర్వహించాలని ఆదేశించారు. వైద్యులపై అనుచిత ప్రవర్తనను సహించేది లేదని, అలాంటి ఘటనలు జరిగితే డీఎంహెచ్‌వో దృష్టికి తేవాలన్నారు. బయో మెడికల్ వ్యర్థాలను మున్సిపల్ చెత్తలో వేయకుండా నియమ నిబంధనల ప్రకారం ఏజెన్సీ వాహనాలకే అప్పగించాలని స్పష్టం చేశారు. ఆశా, ఏఎన్ఎం, అంగన్‌వాడీల సమన్వయంతో 'శ్యామ్‌మామ్' చిన్నారులను గుర్తించి జీజీహెచ్‌లోని ఎన్ఆర్‌సీకి పంపి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ట్రైనీ కలెక్టర్ సూచనలను ప్రతి పీహెచ్‌సీ పరిధిలో అమలు చేస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రాజశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ విద్య, డాక్టర్ రవీందర్, డాక్టర్ సికందర్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, పిహెచ్‌సి వైద్యాధికారులు పాల్గొన్నారు.





ఒక్క సీసీ కెమెరా.. 100 మంది పోలీసులతో సమానం : సీపీ పి.సాయిచైతన్య

- పచ్చల నడుకుడాలో 16 సీసీ కెమెరాలు ప్రారంభం

నిజామాబాద్ జిల్లా , (డీడీ9 వార్త) :

నేరాల నివారణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసు సిబ్బందితో సమానమని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య అన్నారు. 'మన ఊరు మన భద్రతమన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా వేల్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పచ్చల నడుకుడా గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను గురువారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ కెమెరాల ద్వారా అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. వ్యాపారులు, దుకాణ యజమానులు తమ షాపుల వద్ద తప్పని సరిగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, ప్రజలు కూడా తమ భద్రతను బాధ్యతగా భావించి సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్ రెడ్డితో పాటు గ్రామ పంచాయతీ వర్గాన్ని సీపీ అభినందించారు. అనంతరం గ్రామంలో డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. రెడ్డీస్ యూత్ గణేష్ మండలి వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొని, యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, రూరల్ సీఐ జాన్ రెడ్డి, వేల్పూర్ ఎస్సై సంజీవ్, సర్పంచ్ కొల్లే నరసయ్య, ఉపసర్పంచ్ రఘుపతి, మాజీ సొసైటీ అధ్యక్షుడు లింబారెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



బోథ్ మండల సర్పంచులకు
ఆర్ జి పి ఆర్ ఎస్ శిక్షణ

- **గ్రామాభివృద్ధి, పంచాయతీరాజ్ పరిపాలనపై సర్పంచులకు దిశానిర్దేశం**

అదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 17: (డిడి 9 వార్త న్యూస్):

బోథ్ నియోజకవర్గ పరిధిలోని సర్పంచులకు రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ (ఆర్ జి పి ఆర్ ఎస్) ఆధ్వర్యంలో గురువారం ఇచ్చోడలోని గంగారెడ్డి గార్డెన్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ, సర్పంచుల విధులు, గ్రామ సభల నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు, పంచాయతీ నిధుల వినియోగం, పారదర్శక పరిపాలన తదితర అంశాలపై సర్పంచులకు అవగాహన కల్పించారు.

ఆర్ జి పి ఆర్ ఎస్ తెలంగాణ ఇన్‌చార్జ్ సుభాష్ యక్కర, రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్, జాతీయ శిక్షకులు సుశీల్, కోఆర్డినేటర్ అరుణ్, జోనల్ కోఆర్డినేటర్ నవీన్ శిక్షణ కార్యక్రమంలో సర్పంచులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. గ్రామాల అవసరాలను గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.



మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుని మర్యాదపూర్వకంగా కలిసిన వేణు యాదవ్

ఆదిలాబాద్ జిల్లా (బ్యూరో): సెప్టెంబర్ 17: (డిడి 9 వార్త న్యూస్):



ఆదిలాబాద్: ఆదిలాబాద్ తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ వేణు యాదవ్ జిల్లా కేంద్రంలోని టైలర్స్ కాలనీ టీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బోథ్ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు నాయకులు చర్చించినట్లు తెలిపారు. పార్టీ బలోపేతం, క్షేత్ర స్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం వంటి అంశాలపై చర్చ జరిగినట్లు పేర్కొన్నారు. అనంతరం రాథోడ్ బాపురావు ని వేణు యాదవ్ శాలువాతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా రాథోడ్ బాపురావు మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని, పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశం ద్వారా పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం ఏర్పడిందని నాయకులు తెలిపారు. అలాగే తెలంగాణ రక్షణ సేన టి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాథోడ్ బాపురావు *ఆదిలాబాద్ ఇంచార్జ్ వేణు యాదవ్ కి ఘనంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఆవిష్కరించిన
బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

అదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 17: (డిడి 9 వార్త న్యూస్):

తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో అత్యంత ప్రాధాన్యత కలిగిన రోజని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. తెలంగాణ ప్రజల ఐక్యత, సోదరభావం, ప్రజాస్వామ్య విలువలను చాటి చెప్పే ఈ రోజును ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం నుంచి నేటి వరకు రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడిన ఉద్యమకారులు, అమరవీరులు, ప్రజల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకోవాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం, స్వాభిమానం, హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, రైతులు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలు సహా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలని ఆకాంక్షించారు.

తెలంగాణ ఐక్యత తెలంగాణ ఆత్మగౌరవం తెలంగాణ అభివృద్ధి అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సురేందర్ యాదవ్, రమన గౌడ్, తాహెర్, ప్రశాంత్, ప్రవీణ్, రాజు రెడ్డి, సుభాష్, ప్రీతం రెడ్డి, దేవేందర్ రెడ్డి, రఫీ, సుజీల్ తో పాటు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇందూరు నేలలో మిన్నంటిన
ప్రజా పాలన సంబరాలు

- **జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి**

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 17(డీడీ9 వార్త):

ఇందూరు నేల ఉద్యమ స్ఫూర్తితో ఉప్పొంగింది. గురువారం సమీకృత నిజామాబాద్ జిల్లా కార్యాలయాల సముదాయంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో జరుపుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. అమరుల త్యాగఫలమే నేటి ప్రజాస్వామ్య తెలంగాణ అని, నిరంకుశ పాలన నుంచి విముక్తి పొంది ప్రజలే పాలకులుగా మారిన శుభదినమిదని ఆయన అభివర్ణించారు. ఆరు గ్యారంటీలతో నిజామాబాద్ జిల్లా అభివృద్ధి, సంక్షేమాల్లో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తోందని గర్వంగా ప్రకటించారు. జిల్లా ప్రగతి నివేదికను ప్రజల ముందుంచుతూ వ్యవసాయం నుండి సంక్షేమం వరకు ప్రభుత్వం సాధించిన విజయాలను సుదర్శన్ రెడ్డి ఒక్కొక్కటిగా వివరించారు. ఈ వానాకాలంలో రైతన్నలకు సాగు సాయంగా రూ. 316.21 కోట్లను రైతు భరోసా రూపంలో ఖాతాల్లో వేశామని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రత కల్పిస్తూ కొత్తగా 75 వేలకు పైగా రేషన్ కార్డులు ఇచ్చామని, ప్రతి నెలా 30 వేల మెట్రిక్ టన్నుల ఉచిత బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అక్కచెల్లెమ్మలకు మహాలక్ష్మి ఉచిత ప్రయాణం ఒక వరంలా మారిందని, ఇప్పటి వరకు రూ. 449.36 కోట్ల మేర వారికి ఆర్థిక లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తం చేశారు. గృహజ్యోతితో లక్షలాది ఇళ్లలో వెలుగులు నింపుతున్నామని, 2.80 లక్షల కుటుంబాలకు జీరో బిల్లులు ఇస్తున్నామని తెలిపారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ రూ. 800 కోట్లతో నాలుగు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచి పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి ద్వారా 71 వేలకు పైగా దరఖాస్తులను పరిష్కరించామని, 18 గ్రామాల్లో రీసర్వే పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థుల నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నారు. వేడుకల్లో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి, సీపీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగ రావు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.











బోధన్ మండలంలో అట్టహాసంగా ప్రధాని బర్త్‌డే, విమోచన వేడుకలు

బోధన్, నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 17(డీడీ9 వార్త):

దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని బోధన్ మండలంలో మంగళవారం వేడుకలు ఘనంగా జరిగాయి. బీజేపీ బోధన్ మండల రూరల్ అధ్యక్షుడు సిర్ప సుదర్శన్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు, జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్దాపూర్ గ్రామంలోని ఓపెన్ జిమ్ వద్ద నాయకులు కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. పెగడపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. అనంతరం విమోచన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మావంది ఖుర్ద్ గ్రామంలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల చిన్నారులకు నోట్‌బుక్‌లు, పరీక్ష ప్యాడ్లు, పండ్లు పంపిణీ చేయడంతో పాటు కేక్ కట్ చేశారు. కల్దురికి గ్రామంలో కూడా ప్రధాని జన్మదిన కేక్ కట్ చేసి, విమోచన దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఎగురవేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రధాన కార్యదర్శులు లక్ష్మారెడ్డి, జంగం వెంకటేష్, సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్‌లు జ్యోతి శంకర్, సంజీవ్, వార్డు సభ్యులు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు న్యాలం శ్రీనివాస్, నాయకులు జిల్కరి ప్రవీణ్, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గౌరవ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు చిత్రపటానికి పాలాభిషేకం

అదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 17: (డిడి 9 వార్త న్యూస్):

ఈరోజు బోత్ పట్టణంలో గౌరవ కెసిఆర్ కి ఆదివాసి గిరిజనులు పాలాభిషేకం చేశారు గతంలో ఉన్న ఆరు శాతం రిజర్వేషన్లను 10 శాతానికి పెంచి నేటికీ మూడు సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా ఈరోజు పట్టణంలో కేసీఆర్ చిత్రపటానికి ఆదివాసి గిరిజనులు కృతజ్ఞతలు తెలుపుతూ పాలాభిషేకం చేశారు గతంలో ఆదివాసులను ఎవరు పట్టించుకునే వారు లేరని కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యాక గిరిజనుల అభివృద్ధికి బాటలు వేశారని మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రభుత్వమే మళ్లీ రావాలని మాకు అన్ని విధాలుగా కేసీఆర్ ప్రభుత్వం ఆదుకుందని అలాగే తాండాలను గూడాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు మేమంతా కేసీఆర్ వెంటే ఉంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో బోథ్ పట్టణ బి ఆర్ఎస్ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్ ఆదివాసి పటేల్ జానకిరామ్ విడిసి చైర్మన్ పోతన్న మాజీ ఆత్మ చైర్మన్ సుభాష్ గ్రంథాలయ డైరెక్టర్ రమణ గౌడ్ మొహమ్మద్ రఫీ ఇస్తే కార్ మాజీ వార్డు సభ్యులు రవి మాజీ వార్డ్ సభ్యులు మచ్చేందర్ సోలాంకి సత్యనారాయణ మహిళలు బి ఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు



పట్నాపూర్ లో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 17: (డి 9 వార్త న్యూస్):

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పట్నాపూర్ గ్రామపంచాయతీలో తెలంగాణా ప్రజా పాలనా దినోత్సవన్ని పురస్కరించుకొని సర్పంచ్ పంద్రం సుగుణ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అనంతరం గ్రామపంచాయతి ఆవరణలో నిర్వహించిన వి బి జి రామ్ జీ గ్రామసభలో మండల ఏపిఓ జగ్గేరావు గారు పాల్గొని గ్రామపంచాయతిలో ప్రస్తుత సంవత్సరం మొత్తం చేయవలసిన పనులను గ్రామసభ ద్వారా గుర్తించి ప్రతి జాబ్ కార్డుకలిగి ఉన్న లబ్ధిదారులకు పని కల్పించేలా గ్రామ పంచాయతీ పాలకవర్గం బాధ్యత తీసుకోవాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆత్రం మోహన్ వార్డు మెంబర్ తోడషం అనిల్ కుమార్ నల్లోల శివన్న తోడషం నిలకాంత్ రావ్ సిడం రాంపలకు టిపి శేఖర్ సెక్రటరీ స్వామి మాజీ సర్పంచ్ గోపాల్ తోడషం కైలాష్ ఆడెం పొల్లు దుర్వ రాంచందర్ అంగన్వాడీ సుశీల ఆశ యశోద గ్రామస్తులు పాల్గొన్నారు



బోథ్ వాసికి భారత గురురత్న అవార్డు

- **భారత గురురత్న అవార్డు పొందిన విశ్వకర్మ ముద్దుబిడ్డ ఘనంగా సన్మానించిన విశ్వబ్రాహ్మణ బోథ్ సంఘం సభ్యులు**

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం సెప్టెంబర్ 17: (డిడి 9 వార్త న్యూస్):

భారత గురు రత్న అవార్డ్ పొందిన విశ్వ బ్రాహ్మణ ముద్దుబిడ్డ అల్లు సాగర్ (ఎస్.ఎ.)ను ఈరోజు విశ్వ కర్మ జయంతి సందర్భంగా విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ సంఘం బోథ్ ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలోబోథ్ టౌన్ అధ్యక్షులు రంగు రాజు, అదిలాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మెడిచేల్మ ప్రవీణ్, మరియు సంఘం సభ్యులు పాల్గొన్నారు



బోథ్ లో ఘనంగా విశ్వకర్మ జయంతి

- **బోథ్ మండల్ కేంద్రంలో విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా విశ్వకర్మ జయంతి**

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 17: (డిడి 9 వార్త న్యూస్)

ఈరోజు బోథ్ మండల విశ్వకర్మ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా విశ్వకర్మ జయంతి నిర్వహించడం జరిగింది సృష్టికి మూలం విశ్వకర్మ సృష్టి భగవానుడు విశ్వకర్మ సృష్టిని నడిపించే సృష్టికర్త విశ్వకర్మ భగవానుడు సృష్టికి మొదటి ఇంజనీర్ విశ్వకర్మణి అని విశ్వకర్మలు కొనియాడారు ఈ కార్యక్రమంలో రంగు రాజు,పాప ఈశ్వర్, మెడిచేల్మ ప్రవీణ్, సౌరాల రూపేష్, అల్లి సాగర్, ప్రసాద్, ప్రయాణం, మహేష్, మంత్రి శ్యామ్, లక్ష్మణ్, సత్తయ్య, నరసింహ దాస్, రాంసాగర్, బ్రహ్మం, భాస్కర్, గట్టు మహేష్, మహిళా సోదరీమణులు. 9.వార్డ్ మెంబర్స్ మెడిచేల్మ రూప ప్రవీణ్. సౌరాల లావణ్య మరియు విశ్వకర్మ సోదరులు పాల్గొన్నారు







మట్టి వినాయకులతోనే పర్యావరణానికి రక్షణ

- **బషీరాబాద్ గ్రామస్తులను అభినందించిన సీపీ**

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 17 (డీడీ9 వార్త):

మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి బషీరాబాద్ గ్రామం జిల్లాలోనే పర్యావరణ పరిరక్షణకు ఆదర్శంగా నిలిచిందని నిజామాబాద్ సీపీ సాయి చైతన్య అభినందించారు. కమ్మర్ పల్లి మండలంలోని బషీరాబాద్‌లో సర్పంచ్ జమున మహేష్, ఉప సర్పంచ్ భూమేష్, వీడీసీ అధ్యక్షుడు పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి మండపాన్ని బుధవారం ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో సీపీతో పాటు ఆర్మూర్ ఏసీపీ, భీంగల్ సీఐ సత్యనారాయణ గౌడ్, కమ్మర్‌పల్లి ఎస్సై చాకలి సతీష్ పాల్గొన్నారు. అనంతరం సీపీని గ్రామస్థులు, వీడీసీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... గ్రామంలో 90 శాతానికి పైగా మట్టి గణపతులనే ప్రతిష్ఠించారని తెలిసి, స్వయంగా వచ్చి అభినందించాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఉత్సవాల్లో డీజేలు వినియోగించకుండా ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. విద్యార్థులకు సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు రైతుల సమస్యలపైనా మాట్లాడారు. గ్రామంలో ఇలాంటి చైతన్య కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు



ఆనంద్, రమేష్, వార్డు సభ్యులు రాజు, శేఖర్, లక్ష్మి, శ్రీనివాస్, నాయకులు యెనుగు గంగారెడ్డి, మోహన్, గంగాధర్, వివిధ ఉత్సవ కమిటీల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నర్సింహాసాగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లిస్ట్ కలకలం

- **అనధికారిక జాబితాపై విచారణ జరపాలి.. నిజమైన పేదలకు న్యాయం చేయాలి**
- **బీజేపీ నాయకుల డిమాండ్**

మంగపేట సెప్టెంబర్17డీడీ9 వార్త

మంగపేట మండల పరిధిలోని నర్సింహాసాగర్ గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు అధికారులు అర్హులైన పేదలను గుర్తించేందుకు గ్రామాల్లో సర్వే నిర్వహిస్తుండగా, మరోవైపు కొందరు స్థానిక రాజకీయ నాయకులు ప్రైవేట్‌గా సమావేశం ఏర్పాటు చేసి తమకు అనుకూలంగా భావించిన వారి పేర్లతో తాత్కాలిక జాబితాను రూపొందించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇటీవల 31 మంది పేర్లతో కూడిన ఓ జాబితా సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆ జాబితా వాట్సాప్ గ్రూపుల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతోంది. ఈ జాబితాలో ఒకే సామాజిక వర్గానికి చెందినవారికి, అలాగే కొందరు నాయకులకు సన్నిహితులుగా ఉన్నవారికి ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

నిజంగా ఇళ్లు లేక అద్దె ఇళ్లలో జీవిస్తున్న పేదలను పక్కనబెట్టి, రాజకీయ లేదా సామాజిక వర్గాల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక జరిగితే అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఏకపక్ష నిర్ణయాలు జరిగాయని, ప్రస్తుతం అదే విధానం పునరావృతం అవుతోందని వారు ఆరోపిస్తున్నారు.

గ్రామ సమస్యలు పట్టించుకోరా?

నర్సింహాసాగర్ గ్రామంలో డ్రైనేజీలు, రోడ్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. పారిశుద్ధ్యం, మౌలిక వసతుల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, వాటి పరిష్కారంపై చూపాల్సిన శ్రద్ధకు బదులుగా ఇళ్ల లబ్ధిదారుల అనధికారిక జాబితాల రూపకల్పన, రాజకీయ వ్యవహారాలపై కొందరు నాయకులు దృష్టి పెడుతున్నారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.


అదేవిధంగా గ్రామపంచాయతీకి కార్యదర్శి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చిన్నచిన్న ధ్రువపత్రాలు, పంచాయతీ సంబంధిత పనుల కోసం కూడా ఇబ్బందులు



ఎదురవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామ సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపాలని వారు కోరుతున్నారు.

గ్రామసభ నిర్వహించి అర్హులను ఎంపిక చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న 31 మంది పేర్ల జాబితాపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బొల్లికొండ సాంబయ్య, బూత్ అధ్యక్షుడు ఈర్ల మధుసూదన్, సోషల్ మీడియా



క్రమ సంఖ్య	పేరు	కులం / వర్గం
1	బొల్లి మీరా కుమారి	యస్సీ మాలా
2	బొలా అమ్మాజ్ఞా	యస్సీ మాలా
3	ఎండ్ల మరియా	యస్సీ మాలా
4	చీకట్ల	యస్సీ మాలా
5	తోట మరియా	ఎస్టీ కొమ	
6	ఎర్రికొమ్మా అశీలు (యస్సీ మాలా)	
7	మైదం లాలమ్మ	యస్సీ మాలా
8	అమ్మ అమ్మి	బీసీ యాదవ
9	మూకమేని ఎంప్రాక్షం	బీసీ కుమ్మ
10	తుంపురాలే రాజమల్లిఖార్జి	బీసీ కుమ్మ
11	కొప్పులూరి లక్ష్మి రాజు	బీసీ కుమ్మ
12	ఆంగం భాగ్య	బీసీ ముదిరాజ
13	బండే వీరమల్లి	బీసీ గొ
14	ఇరోజ్ రాజమ్మ	బీసీ వెలుగో
15	తుల్ల అమ్మ	బీసీ మున్నూరుకాపు
16	పెసరగు రెండు	బీసీ రజక
17	మందల భాగ్య	బీసీ పద్మశాలి
18	కోమల సరళా	బీసీ పద్మశాలి
19	పాగ భాగ్యమ్మ	బీసీ పద్మశాలి
20	పసుగ్లేటి యుగ	బీసీ యాదవ
21	ఎంగోజి లత	బీసీ పద్మశాలి
22	బండారి రాజమ్మ	బీసీ పద్మశాలి
23	బోడ గోపు లాలింబాయ్	బీసీ పద్మశాలి
24	అన్నాల అరుణ	బీసీ ఎస్
25	అంతటి యామేని	బీసీ యాదవ
26	కొంగ సుమ్మీ	బీసీ పద్మశాలి
27	పల్లెబోయిన మమత	బీసీ యాదవ
28	గుడూరు తుళ్ళి	బీసీ పద్మశాలి
29	ఫ్రసీళ్ల సుప్రీ	బీసీ యాదవ
30	ముల్కూల లలిత	బీసీ యాదవ
31	సిద్ధగళ్ల బారికే	బీసీ కుమ్మ


ఇన్‌చార్జి ఎంబటి నవీన్ డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామపంచాయతీకి కార్యదర్శిని నియమించాలని, గ్రామసభను నిర్వహించి ప్రజల సమక్షంలో అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించాలని వారు కోరారు. నిజమైన పేదలకు న్యాయం జరగకపోతే గ్రామంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. అయితే సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ జాబితా అధికారిక లబ్ధిదారుల జాబితా కాదా అనే విషయాన్ని సంబంధిత అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

జనగామ 4 ఎకరాల 04 గుంటల గొర్రెల పెంపకదారుల సంఘం భూమి అక్రమ రిజిస్ట్రేషన్

జనగామ, సెప్టెంబర్ 17 (డిడి9): వార్త

జనగామ జిల్లా పెద్దపహాడ్ గ్రా*4 ఎకరాల 04 గుంటల గొర్రెల పెంపకదారుల సంఘం భూమి అక్రమ రిజిస్ట్రేషన్ జనగామ జిల్లా పెద్దపహాడ్ గ్రామానికి చెందిన శ్రీ మల్లికార్జున గొర్రెల పెంపకదారుల సంఘానికి చెందిన 4 ఎకరాల 04 గుంటల భూమిని ఉస్మానియా అగ్రో ఇండస్ట్రీస్ వారు అక్రమంగా, ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని సంఘ సభ్యులు ఆరోపించారు.

సంఘంలో దాదాపు 60 మంది సభ్యులు ఉన్నారని, ఈ భూమిని గొర్రెల పెంపకదారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం గొర్రెల పంపిణీ / వరహాల పథకం కింద కేటాయించిందని తెలిపారు. ఇట్టి భూమికి సర్వే నెం. 582/F లో గల భూమిని తేదీ 08/06/2005 రోజున డాక్యుమెంట్ నెం. 5556/2005 ద్వారా శ్రీ మల్లికార్జున గొర్రెల పెంపకదారుల సంఘం పేరున రిజిస్ట్రేషన్ చేయించామని పేర్కొన్నారు. అయితే తమ సంఘ సభ్యులకు ఎవరికీ తెలియకుండా, తమ ప్రమేయం లేకుండానే తేదీ 02/01/2007 రోజున డాక్యుమెంట్ నెం. 11/2007 ద్వారా ఉస్మానియా అగ్రో ఇండస్ట్రీస్ వారు తిరిగి రిజిస్ట్రేషన్ చేసుకొని దౌర్జన్యంగా భూమిని కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమి విషయమై పలుమార్లు వెళ్లి అడగగా తమను బెదిరించారని, ఆ రోజు నుండి నేటి వరకు తమ భూమి కోసం పోరాడుతున్నామని తెలిపారు. కావున సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఫోర్జరీ సంతకాలతో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ పై విచారణ జరిపి, చర్యలు తీసుకొని తమ సంఘ భూమిని తిరిగి తమకు అప్పగించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



జనగామ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం లో ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుక

జనగామ సెప్టెంబర్ 17(డిడి9) వార్త



జనగామతెలంగాణ విలీన మరియు ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జనగామ రైతులకు మరియు ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు ఈరోజు జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం లో ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు . ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరించిన జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుకు శివరాజ్ యాదవ్

ఈ సందర్భంగా శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ 1948లో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడంతో ప్రజాస్వామ్య పాలనకు మార్గం సుగమమైంది అని తెలిపారు. అదేవిధంగా నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజల హక్కులు, స్వేచ్ఛ, ఆత్మగౌరవం కోసం పోరాడిన రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, సామాన్య ప్రజలు, అమరవీరుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పిస్తునాము. అని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ *బనుక శివరాజ్ యాదవ్ అన్నారు.

అదేవిధంగా ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజలకు అండగా ఉంటూ ప్రజా పాలన ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమం లో వ్యాపారులు చేరివిరాల ఉపేందర్, కృష్ణ రెడ్డి,మండల ఉపాధ్యక్షులు సాదం మధుసూదన్,మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బనుక ప్రభాకర్,హమాలీ సంఘం నాయకులు రాజు,వీర స్వామి ,సిద్ధులు,రమేష్, కుమార్,AMC సిబ్బంది బాబు రావు, ఎల్లయ్య,కృష్ణ, శారద,కుమార స్వామి, ప్రవీణ్, ఉమా మహేశ్వరి, కోమలత, నిరోష,క్రాంతి, సాయి ,మహిళలు, మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఊరట్టం గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

- **గిరిజనుల రిజర్వేషన్‌ను 6 శాతం నుండి 10 శాతానికి పెంచాలి**
- **నేటికి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఊరట్టం గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.**

తాడ్వాయి డిడి9 వార్త



తాడ్వాయి మండలంలోని ఊరట్టం సర్పంచ్ కొమరం శైలజ స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు.

ఈకార్యక్రమంలో వార్డ్ మెంబర్ నాలి ప్రతిభ, మాజీ సర్పంచ్ గొంది శ్రీధర్, నాలి రాంబాబు, సొలం రాంబాబు, చర్ప చరణ్, విద్యామరి సతీష్, గజ్జెల రాంబాబు,గజ్జెల సమ్మయ్య,అంబాల రాందాస్, మహిళా కార్యకర్తలు గొంది రాజశ్రీ, కొమరం అనురాధ, చర్ప స్వరూప తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల హక్కులు, సంక్షేమం మరియు అభివృద్ధి కోసం కృషి కొనసాగాలని ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు.

ఘనంగా కే సీ ఆర్ జన్మదిన వేడుకలు



- **కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన టివిటి గ్రామ ఆదివాసిలు**

అదిలాబాద్ జిల్లా: సోనాల మండలం సెప్టెంబర్ 17: (డిడి 9 వార్త న్యూస్):

సోనాల మండలంలోని టివిటి గ్రామంలో వేడుకలు తెలంగాణ ఏర్పడ్డ తర్వాత తెలంగాణ అభివృద్ధి చెందాలంటే ముందుగా ఎస్టీలు అభివృద్ధి చెందాలని తెలంగాణ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రివర్యులు కెసిఆర్ గారు ఆరు శాతం రిజర్వేషన్ను 10 శాతం పెంచి ఎస్టీల హక్కులకై అభివృద్ధికై నాలుగు శాతం రిజర్వేషన్ పెంచి వారి అభివృద్ధికి బాటలు వేసిన సందర్భంగా నేడు సోనాల మండలం లోని టివిటి గ్రామ ఆదివాసి సోదరులు నాయకులు వారి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది

ఇట్టి కార్యక్రమంలో సోనాల గ్రామ సర్పంచ్ బిందుజ సుధీర్ రెడ్డి, సోనాల పట్టణ అధ్యక్షులు చిన్నయ్య, నాయకులు అభిలాష్, రమేష్ భత్తుల, గణేష్, రాజన్న, దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు

బోథ్ లో మోదీ జీ జన్మదిన వేడుకలు

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 17: (డిడి 9 వార్త న్యూస్):

దేశ ప్రధాని భరతమాత ముద్దుబిడ్డ హిందూ హృదయ నేత నరేంద్ర మోడీ 76వ జన్మదిన వేడుకలు భోథ్ పట్టణంలో ఘనంగా జరుపుకోవడం జరిగింది వారికి నిండు నూరేళ్లు ఆ భగవంతుడు ఆయురారోగ్యాలతో ప్రసాదించాలని ముందు ముందు కూడా భారత ప్రధాన మంత్రిగా కొనసాగలని భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాము భారతీయ జనతా పార్టీ బోథ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నరేంద్ర మోడీ గారి జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ జన్మ దిన వేడుకల్లో పిడుగు అశోక్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కుల వెంకటేష్, మాజీ మండల అధ్యక్షులు సుభాష్ సూర్య , లాడేవార్ తుకారం, కట్కూరి సాయి, చింతల పెల్లి కిరణ్, జటాల శివ, వికాస్ పటేల్, జన్మదిన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు



జాతీయ సమైక్యతా వేడుకల్లో పాల్గొన్న జీవన్ రెడ్డి

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 17(డీడీ9 వార్త):

జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి తొలుత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మన్ విఠల్ రావు, బీఆర్ఎస్ నాయకుడు బాజిరెడ్డి జగన్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



దేవులనాయక్ తండా లో కొత్త పెన్షన్ల సర్వే

ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 17: (డిడి 9 వార్త న్యూస్):

సోనాల మండల పరిధిలోని దేవులనాయక్ తండా గ్రామంలో 'చేయూత' కొత్త పింఛన్లు క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది మండల పరిషద్ అధికారి రత్నాకర్ రావు ఇంటింటికీ తిరిగి కొత్త పెన్షన్ దరఖాస్తుదారులు మరియు ఇందిరమ్మ ఇండ్లు పరిశీలించారు వివరాలను సేకరించారు.





పేద విద్యార్థులకు ఉచిత బ్యాగులు, పుస్తకాల పంపిణీ

గ్రేస్ సర్వీస్ సొసైటీ ఖమ్మం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉచిత బ్యాగులు, పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని MPPS కాటాపురం పాఠశాలలో నిర్వహించారు.

తాడ్వాయిడిడి9 వార్త

తాడ్వాయి కాటాపురం సర్పంచ్ శ్రీడ్డి మోహన్ రావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఉచిత బ్యాగులు, పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే పాలకుర్తి ఉపసర్పంచ్ బాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో MPPS కాటాపురం పాఠశాల HM మానేశ్వర్ ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పేద విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుకు ప్రోత్సాహం అందిస్తున్న గ్రేస్ సర్వీస్ సొసైటీ ఖమ్మం సేవలను ఈ సందర్భంగా అభినందించారు.

ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎలాంటి అవకతవకలకు తావు లేదు

- **మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు**

మంగపేట సెప్టెంబర్ 17డిడీ 9 వార్త



మంగపేట మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పూర్తి పారదర్శకతతో అర్హులైన పేదలకు మాత్రమే ఇండ్లు మంజూరు చేయాలని ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం,సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు గూడు కల్పించాలనే దృఢ సంకల్పంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో లబ్ధిదారుల ఎంపిక చేపడుతుందని తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల విషయంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు ఎవరైనా జోక్యం చేసుకోవడం,అక్రమాలకు పాల్పడడం లేదా లబ్ధిదారులను ప్రలోభాలకు గురిచేయడం వంటివి చేస్తే పార్టీ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి,ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హతలను పరిశీలించిన అనంతరం మాత్రమే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తారని తెలిపారు.కాబట్టి ప్రజలు ఎలాంటి అపోహలకు,ప్రలోభాలకు గురి కావద్దని,ఎవరైనా డబ్బులు అడిగినా లేదా ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినా నమ్మవద్దని సూచించారు.

నిజమైన అర్హత కలిగిన లబ్ధిదారులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ప్రయోజనం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని,ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ఘనంగా జెండా ఆవిష్కరణ..

సెప్టెంబర్ 17 డిడి9 వార్త వెంకటాపురం.

ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటాపురం మండలంలోని ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో గురువారం ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వైద్యాధికారి ఆశిష్ అధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ ఆరోగ్య సేవలు, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా ఆరోగ్య పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్యాధికారి సిబ్బందికి సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయనే విషయాన్ని ప్రతి కుటుంబానికి చేరవేసేలా కృషి చేయాలని తెలిపారు.ప్రజా ఆరోగ్య పరిరక్షణలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఆశిష్, హెచ్ఈఓ కోటిరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ అసిస్టెంట్లు మోహన్, కృష్ణ, భూపతిరావు, రాంబాబు, ఏఎన్ఎం వెంకటరమణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్ ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన సబ్ కలెక్టర్

భద్రాచలం టౌన్,సెప్టెంబరు 17(డిడీ 9వార్త)

అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను గురువారం భద్రాచలం సబ్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మృనాల్ శ్రేష్ఠ పరిశీలించారు. భద్రాచలం మండలంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఎస్ ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి,ప్రజలతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం బీఎల్ ఓ సూపర్ వైజర్లు, బూత్ లెవల్ అధికారులు తో సమావేశమై ప్రక్రియ పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ఎస్ ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల నుంచి అందుతున్న వివరాలు, దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా బీఎల్ ఓలు, సూపర్ వైజర్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన సర్పంచ్ మడకం కుమారి ఆంధ్రయ...

- **ముందుగా సొసైటీ ఆఫీసు నందు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలతో వందనం తెలిపిన సర్పంచ్ కుమారి ఆంధ్రయ్య మరియు నారాయణపురం సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు...**

అశ్వరావుపేట:సెప్టెంబర్ 17(డిడి 9 వార్త)

నారాయణపురం సొసైటీ ప్రాగణంలో తెలంగాణ తల్లికి పూలమాలతో సత్కరించిన సర్పంచ్ కుమారి ఆంధ్రయ సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు తదుపరి విమోచన దినోత్సవం ఆ రోజుల్లో జరిగిన విషయాలు మననం చేసుకున్నారు

తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా నారాయణపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో జండా వందనం వేడుకలను ఘనంగా నిర్వహించిన సర్పంచ్ కుమారి ఆంధ్రయ్య జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలవేసి వారికి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమారి ఆంధ్ర మాట్లాడుతూ... 1948 సెప్టెంబర్ 17. అనాటి తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయ దినం. నాటి హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్ లో విలీనం అయిన రోజు ఆ మహత్తర ఘట్టాన్ని కి 78 సంవత్సరాల పూర్తయి నేడు 79 వ సంవత్సరంలో అడుగు పెడుతున్న ఈ శుభ సందర్భంగా తెలంగాణ విమోచన ఉద్యమంలో పాల్గొన్న వీరులను ప్రజాస్వామ్యం కోసం పోరాడిన మహనీయులను ప్రాణ త్యాగం చేసిన అమరవీరులను హృదయపూర్వకంగా స్మరించుకున్నారూ. వారి త్యాగాల స్ఫూర్తితో ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుంటూ ప్రజల కోసం ప్రజల భాగస్వామ్యంతో ప్రజలకు మరింత చర్యమైన పాలన అందించాల్సిన బాధ్యత మనందరి పైన ఉంది అని గ్రామ ప్రజలకు పెద్దలకు నాయకులకు ఆమె కోరారు.

ప్రజా పాలనలో ప్రజల ఆకాంక్షలే ప్రాధాన్యం ఇవ్వాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజలకు ఆర్థిక సామాజిక భరోసా కల్పిస్తుంది ఈ ప్రభుత్వం. అట్టడుగు వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా చేపట్టిన సామాజిక ఆర్థిక కుల గణన ఇందుకు మార్గదర్శక నిలుస్తుంది ఈ పాలన సాధించిన ప్రగతిని మనమందరము చూస్తున్నాము అని సర్పంచ్ కుమారి ఆంధ్రయ కొని ఆడారు.


సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు మాట్లాడుతూ... నారాయణపురం సొసైటీ ఆఫీసు నందు జండా ఎగరవేసిన నిర్మల పుల్లారావు, సెక్రటరీ అరుణ.. ఆయన మాటల్లో వల్లభాయ్ పటేల్ ని ఆయన స్మరించుకున్నారు అలాగే

జాతిపిత మహాత్మా గాంధీ తన జీవిత అంతిమ సూత్రముగా చెప్పినట్టు "ఎప్పుడైనా సందేహం కలిగితే, నీవు చూసిన అత్యంత పేద, బలహీనుడైన వ్యక్తి ముఖాన్ని గుర్తు చేసుకో, నీవు తీసుకోబోయే ప్రతి చర్య అతనికి ఉపయోగపడుతుందా అని ప్రశ్నించుకో" ఆ స్ఫూర్తి కేవలం ప్రభుత్వ కార్యాలయల ద్వారా సాగే పరిపాలన మాత్రమే కాదు.... ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడం, రైతులకు అండగా నిలవడం, మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం వైద్యం, విద్య, మౌలిక వసతులను మెరుగు పరచటం, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సేవలను శారవేయటమే నిజమైన ప్రజాపాలన అని ఆయన కొనియాడారు.



రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో జిల్లాని ముగ్గురు మంత్రులు ఎంతో అభివృద్ధి చేస్తున్నారని వ్యవసాయ రంగములు, రోడ్లు రవాణా సౌకర్యాలు, సాగునీటి రంగంలో జిల్లాకు కృష్ణ గోదావరి నదుల అనుసంధానంలో భాగస్వామ్యం తో రైతులకు నీరు ఇచ్చి, పర్యాటకం అభివృద్ధి చేసి పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించడంలో రేవంత్ రెడ్డి సర్కారు శ్రీకారం చుట్టారు. అలాగే తెలంగాణ విమోచన ఉద్యమంలో పాల్గొన్న వీరులకు తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరులకు మరోసారి ఘన నివాళులర్పిస్తూ రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి జిల్లా మంత్రులు మన్యశ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారికి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారికి, మరియు ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క గారికి జిల్లా ప్రజా ప్రతినిధులకు పాత్రికేయ మిత్రులకు అధికారులకు ఉద్యోగులకు తోటి రైతులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీమతి మడకం కుమారి ఆంధ్రయ్య , సొసైటీ సెక్రటరీ అరుణ, సొసైటీ సిబ్బంది, నిర్మల పుల్లారావు,పాలకవర్గ సభ్యులు, మడకం ఆంధ్రయ, యడ్లపల్లి రమేష్, చందా పెద్ద రామారావు, చిన్నంశెట్టి వెంకట నరసింహ, చందు వేణుగోపాల్, పసుపులేటి నరేష్, సవరం సుబ్బారావు, కాటం రామకృష్ణ, చందా చిన్న రామారావు, యాదగిరి వెంకటప్పయ్య, పసుపులేటి దుర్గయ్య, భవాని, సుందరి మేడం మరియు ఆశా వర్కర్లు, గ్రామ దీపికలు, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..







ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

మంగపేట సెప్టెంబర్ 17డిడీ 9 వార్త

తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా బచ్చంపేట బీఆర్ఎస్ నాయకుల కార్యక్రమం తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు, ములుగు జిల్లా నాయకులు చిట్టిమల్ల సమ్మయ్య సూచనలతో బచ్చంపేట గ్రామంలోని ఎస్టీ కాలనీలో బీఆర్ఎస్ (టీఆర్ఎస్) నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన పోరాటాన్ని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన చేపట్టిన కార్యక్రమాలను స్మరించుకున్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కేసీఆర్ నాయకత్వంలో సాగిన ఉద్యమాన్ని గుర్తుచేసుకుంటూ జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో బచ్చంపేట గ్రామ పార్టీ మాజీ అధ్యక్షుడు బూర్గుల వెంకటమల్లు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు,మాజీ నక్క యాకయ్య గౌడ్, చీమల పుష్ప, ఎట్టి సులోచన, నాలి కౌసల్య, నాగమణి సోయం, రాజేష్ సోయం, నాగుల సతీష్, ఎలీషాలా చిట్టీ, జాజుల నర్సయ్య, జాజుల వీరమళ్ళు, కాటూరి విజయ్, పగిడిపెల్లి సూరిబాబు, పాగా సర్వేషం తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తెలంగాణ పోరాట యోధుల త్యాగాలను స్మరించుకోవాలి

- **టీఎన్జీవోస్ సెక్రటరీ గగ్గూరి బాలకృష్ణ**

భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 17 (డీడీ 9 వార్త)

తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవ వేడుకలను టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. టీఎన్జీవోస్ సెక్రటరీ గగ్గూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు.

ఈ సందర్భంగా గగ్గూరి బాలకృష్ణ మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలో కొనసాగిందన్నారు. నిజాం నిరంకుశ పాలన, రజాకారుల దౌర్జన్యాలు, ప్రజలపై జరిగిన దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటాన్ని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల స్ఫూర్తితో భూ ఉద్యమం..

- **ములుగు జిల్లాలో పేదల భూమి, ఇళ్ల స్థలాల కోసం ఉద్యమాలు..**
- **సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ..**

సెప్టెంబర్ 17:డిడి9 వార్త వెంకటాపురం.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ములుగు జిల్లాలో భూ ఉద్యమాన్ని నిర్మిస్తామని సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ అన్నారు. గురువారం వెంకటాపురం మండలం భోదాపురం గ్రామంలో సర్పంచ్ కొరస నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. తొలుత అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని పేర్కొన్నారు. నాటి భూస్వామ్య, జమీందారీ, జాగీర్దారీ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన ఈ పోరాటం వేలాది గ్రామాలకు విస్తరించిందన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ పోరాటం కుల, మతాలకు అతీతంగా భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా సాగిన వర్గ పోరాటమని అన్నారు. ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో ప్రారంభమైన ప్రజా చైతన్యం అనంతరం ఎర్రజెండా నాయకత్వంలో నాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతమైందని సాంబశివ గుర్తు చేశారు. ఈ పోరాటంలో అనేక మంది కార్యకర్తలు, ప్రజలు ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. షేక్ బంధగీ, మొగ్ధం మొయినుద్దీన్, అశ్వవుల్లాఖాన్, సోయబుల్లాఖాన్, భీంరెడ్డి నరసింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, తానునాయక్, ఆరుట్ల కమలాదేవి తదితరులు ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ములుగు జిల్లాలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు, నిరుపేదలకు సాగుభూమి సాధించేందుకు రానున్న కాలంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు, మండల కమిటీ సభ్యులు కాపుల వెంకటేశ్వర్లు, పండా శీను, వెంకట నరసయ్య, కుంజ నారాయణ, పరిష్ఠ కృష్ణ, రైతు నరసింహారావు, కొనసా వీరవేణి, కురుసం మల్లయ్య, వాదం బుచ్చయ్య, జయ, ఇరుప శీను, సోలో నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 17 (డీడీ 9 వార్త)

భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ గీతం, తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాలు, ప్రజా పోరాటాల ఫలితంగా హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్ లో విలీనమైందన్నారు. తెలంగాణ విముక్తి కోసం పోరాడిన యోధుల త్యాగాలను స్మరించుకుంటూ మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడం ఉద్యోగుల బాధ్యత అని తెలిపారు. ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తూ ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఏవో భగవాన్ రెడ్డితో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



భద్రాద్రిలో మరో భారీ ఆర్థిక మోసం

- **అధిక రాబడుల ఆశ.. లక్షల్లో టోపీ**
- **నమ్మకమే పెట్టుబడి.. సొమ్మంతా స్వాహా?**
- **న్యాయం చేయాలంటూ బాధితుల ధర్నా..**
- **నిద్రమాత్రలు మింగిన మహిళ**
- **ఆస్పత్రికి తరలింపు**
- **బాధితుల ఇంటి ఎదుట ఉద్రిక్తత.**

భద్రాచలం, సెప్టెంబర్ 17 (డిడి9 వార్త)

భద్రాచలంలో మరో భారీ ఆర్థిక మోసం వెలుగుచూసింది. అధిక వడ్డీలు, అధిక రాబడులు వస్తాయంటూ నమ్మించి తమ నుంచి లక్షలాది రూపాయలు తీసుకుని తిరిగి చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు ఆరోపిస్తూ పలువురు బాధితులు గురువారం 'భద్రాద్రి' అనే వ్యక్తి ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. తమ సొమ్మును తిరిగి ఇప్పించడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కష్టపడి సంపాదించి కూడబెట్టుకున్న సొమ్మును నమ్మకంతో అప్పగించామని, ప్రస్తుతం ఆ డబ్బు తిరిగి రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పలువురి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి తిరిగి చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

నిద్రమాత్రలు మింగిన మహిళ

బాధితుల ధర్నా కొనసాగుతున్న సమయంలో ఓ మహిళా బాధితురాలు తీవ్ర మనోవేదనకు గురై నిద్రమాత్రలు మింగినట్లు తెలిసింది. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వెంటనే అప్రమత్తమైన తోటి బాధితులు, స్థానికులు ఆమెను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సకాలంలో చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పినట్లు సమాచారం.

తమ నుంచి తీసుకున్న సొమ్మును వెంటనే తిరిగి చెల్లించాలని బాధితులు డిమాండ్ చేశారు. డబ్బులు తిరిగి ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.







ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

- **పంచవృత్తుల పరిరక్షణకు కృషి చేయాలి – సంఘం మండల అధ్యక్షులు మాజోజు చంద్రాచారి**

గుండాల, సెప్టెంబర్ 17 (డీడీ9 వార్త):

గుండాల మండల కేంద్రంలో విశ్వకర్మ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ సంఘం పెద్దలు వెలిశాల సత్యనారాయణ పంచవృత్తుల జెండాను ఎగురవేశారు. అనంతరం విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షులు మాజోజు చంద్రాచారి మాట్లాడుతూ విశ్వకర్మ భగవాన్‌ను దేవశిల్పిగా కొలుస్తారని తెలిపారు. వడ్రంగి, కమ్మరి, కంచరి, స్వర్ణకారులు, శిల్పులు వంటి పంచవృత్తుల ద్వారా సమాజానికి సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. కులవృత్తులను పరిరక్షిస్తూ భావితరాలకు వాటి ప్రాధాన్యతను తెలియజేయాలని కోరారు.

కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు వెలిశాల రవి, కొనపర్తి వెంకటేశ్వర్లు, కందుకూరి హనుమాచారి , మహిళలు, చిన్నారులు, సంఘం సభ్యులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

మత్తు పదార్థాలపై కఠిన నిఘా అవసరం

- **గంజాయి, డ్రగ్స్, గుడుంబా, బెల్ట్‌షాపులను అరికట్టాలి – పీవైఎల్ డిమాండ్**

గుండాల, సెప్టెంబర్ 17 (డీడీ9 వార్త):

గుండాల మండలంలో గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు పూనేం మంగయ్య డిమాండ్ చేశారు. గురువారం పోతిరెడ్డిగూడెం, మటంలంక గ్రామాల్లో పీవైఎల్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వ్యతిరేకంగా బ్యానర్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మంగయ్య మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

గ్రామాల్లో గంజాయి, డ్రగ్స్ వినియోగం పెరగకుండా అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు.సారా, గుడుంబా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైన్స్ షాపుల్లో మద్యం ఎమ్మార్పీ ధరలకే విక్రయించేలా పర్యవేక్షించాలని కోరారు. అక్రమ బెల్ట్ షాపులను నియంత్రించి, పరిమితికి మించి ఉన్న షాపులను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి పీవైఎల్ మండల అధ్యక్షుడు ఊకే శ్రావణ్ అధ్యక్షత వహించారు. మండల కార్యదర్శి కల్తీ సుదర్శన్, కుంజా నరేష్, పూనేం చలపతిరావు, వాగబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీ మార్చ్ విజయవంతం చేయాలని విస్తృత ప్రచారం

చర్ల, సెప్టెంబర్ 17 (డిడి 9 వార్త)

చలో భద్రాచలం (ఐటీడీఏ)కు సెప్టెంబర్ 21 న జరిగే ఆదివాసీ మార్చ్ విజయవంతం కోసం మండలంలో తుడుం దెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్ ఆధ్వర్యంలో తుడుందెబ్బ బృందం ప్రచారం మొదలు పెట్టి అనేక గ్రామాల పంచాయతీ సర్పంచ్ లను కలుస్తూ ఆదివాసీ సమాజానికి జరిగే నష్టాన్ని వివరిస్తూ మండలం లో ఉన్న సర్పంచ్ లు అందరూ ఏకమయ్యి ఆదివాసీ మార్చ్ కి హాజరై ఆదివాసీ ఉద్యమం వైపు నిలబడాలని అన్నారు. అదే విధంగా సర్పంచ్ లు అందరూ కూడా 1996 పెసా చట్టం పూర్తి స్థాయిలో ఉపయోగించాలని, ఫారెస్ట్ అధికారుల ఆగడలను సమర్థవంతంగా ఎదుర్కొని జాతి పక్షాన నిలబడాలని, నిరుద్యోగ యువతను పెద్దస్థాయిలో ఆదివాసీ మార్చ్ కు వచ్చే విధంగా సర్పంచ్ లు బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమం లో పెద్దిపల్లి సర్పంచ్ కణితి రామకృష్ణ, ఆర్.కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవికుమార్, కుర్నపల్లి సర్పంచ్ శ్యామల తిరుపతి, తుడుందెబ్బ మండల సహాయ కార్యదర్శి తాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నెల్లుట్ల చెరువు వద్ద నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

జనగామ సెప్టెంబర్ 17(డిడి9 వార్త)బ్యూరో

వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేష్ విగ్రహాల నిమజ్జనానికి నెల్లుట్ల చెరువు వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ అధికారులు, పోలీసులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, భద్రతా సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.



ఘనంగా అన్ను జన్మదిన వేడుకలు

- **నాలుగు వసంతాలు పూర్తి చేసుకుని ఐదో ఏట అడుగుపెట్టిన చిన్నారి**
- **బంధుమిత్రులు,కుటుంబ సభ్యుల మధ్య ఆనందోత్సాహాలతో వేడుకలు**

ములుగు, డి డి 9 వార్త

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామపంచాయతీ పరిధిలోని రాజేశ్వరరావుపల్లి గ్రామంలో సింగిల్ విండో మాజీ డైరెక్టర్ చంద్రగిరి రాజయ్య మనవరాలు అన్ను జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.చంద్రగిరి ప్రశాంత్-అనూష దంపతుల ప్రథమ పుత్రిక అన్ను నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఐదో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భంగా కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా వేడుకలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఇంటి వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు,స్నేహితుల సమక్షంలో కేక్ కట్ చేసి చిన్నారి అన్ను జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. చిన్నారి కేక్ కట్ చేస్తున్న సమయంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.చిన్నారికి పూలమాలలు,బహుమతులు అందించి ఆప్యాయంగా ఆశీర్వదించారు.నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఐదో సంవత్సరంలోకి అడుగు పెడుతున్న అన్ను భవిష్యత్తులో మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు.




చిన్నారి జీవితంలో ప్రతి అడుగు విజయవంతంగా సాగాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని బంధువులు ఆశీర్వదించారు. జన్మదిన వేడుకలకు బంధుమిత్రులు,కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారి అన్నుతో కలిసి సందడి చేశారు.చిన్నారిని ఆప్యాయంగా పలకరిస్తూ,జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారి కుటుంబ సభ్యులు అతిథులకు ఆతిథ్యం అందిస్తూ వేడుకలను సంతోషంగా నిర్వహించారు.చిన్నారి అన్ను జన్మదిన వేడుకల సందర్భంగా రాజేశ్వరరావుపల్లి గ్రామంలో కుటుంబ సభ్యులు,బంధుమిత్రుల మధ్య సందడి వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా చిన్నారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ అన్ను ఐదో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా బంధుమిత్రుల సమక్షంలో జన్మదిన వేడుకలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. చిన్నారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.

బోనకల్ గ్రామపంచాయతీలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు

బోనకల్,సెప్టెంబర్ 17,(డీడీ9 వార్త):

బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు.తెలంగాణ ప్రజల పోరాట చరిత్రను స్మరించుకుంటూ,స్వేచ్ఛా సమాజ నిర్మాణం కోసం నాటి పోరాట యోధులు చేసిన త్యాగాలను కొనియాడారు.ప్రజలంతా ఐక్యంగా ఉండి గ్రామ అభివృద్ధికి,సామాజిక ప్రగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ బానోతు జ్యోతి,ఉప సర్పంచ్ కొండ, పంచాయతీ కార్యదర్శి కోల రాజేశ్వరి,గ్రామ పెద్దలు గుణపనేని సుధాకర్ రావు,గంగుల శ్రీను,మోర్ల శ్రీను, యార్లగడ్డ రమేష్,పోటు వెంకటేశ్వర్లు,నందమూరి సత్యనారాయణ,గుగులోతు నాగేశ్వరరావు,బండి వెంకటేశ్వర్లు,మీసేవ కోటేశ్వరరావు,గ్రామ పంచాయతీ పాలకవర్గం మరిదు శేషు,షేక్ మేర సాహెబ్,యార్లగడ్డ కుమారి,పంచాయతీ సిబ్బంది,వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన సబ్ కలెక్టర్

భద్రాచలం టౌన్ , సెప్టెంబరు 17 (డీడీ 9 వార్త)

అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను గురువారం భద్రాచలం సబ్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మృనాల్ శ్రేష్ట పరిశీలించారు. భద్రాచలం మండలంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఎస్ ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం బీఎల్ ఓ సూపర్ వైజర్లు, బూత్ లెవల్ అధికారులు తో సమావేశమై ప్రక్రియ పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ఎస్ ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల నుంచి అందుతున్న వివరాలు, దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా బీఎల్ ఓలు, సూపర్ వైజర్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



ప్రజా పాలనతోనే ప్రజా సంక్షేమం సాధ్యం

- **ఐటీడీఏ పీవో బి. రాహుల్ .. ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం**

భద్రాచలం టౌన్ , సెప్టెంబర్ 17 (డీడీ 9 వార్త)

ప్రజల అభిప్రాయాలు, ఆకాంక్షలు, సమస్యలను గుర్తించి వాటికి సత్వర పరిష్కారాలు చూపుతూ సమాజాన్ని సమానత్వం, న్యాయం, అభివృద్ధి దిశగా నడిపించడమే ప్రజా పాలన ముఖ్య ఉద్దేశమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బంది సమక్షంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతం, తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా పీవో బి. రాహుల్ మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ అప్పటి హైదరాబాద్ సంస్థానంతో పాటు మరికొన్ని సంస్థానాలు భారతదేశంలో విలీనం కాలేదన్నారు. హైదరాబాద్ సంస్థానం ప్రస్తుత తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలను కలుపుకొని ఉండేదని వివరించారు. సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసేందుకు అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ చేసిన కృషి ఫలించిందన్నారు. 1948 సెప్టెంబర్ 17న నాటి హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్ లో విలీనమైందని, ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కొండలు, కోనల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పీవో సూచించారు.



వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా.. ఊరేగింపు,నిమజ్జనాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి.

- **వినాయక నిమజ్జనం పై సమన్వయ సమావేశం -- ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు.**
- **మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి.**

మణుగూరు. సెప్టెంబర్ 17(డి డి 9వార్త)



భద్రాద్రి జిల్లా, మణుగూరు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి గురువారం నాడు వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

నిమజ్జన మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణ,బందోబస్తు, విద్యుత్ భద్రత,త్రాగునీరు, వైద్య సదుపాయాలు, క్రేన్ ల ఏర్పాటు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.విగ్రహాల ఊరేగింపు సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం,

నిమజ్జనం సమయంలో గోదావరి నదిలోకి ఇతరులు దిగకుండా చర్యలు చేపట్టడం వంటి అంశాలపై చర్చించారు.అధికారులు నిరంతరం పరిస్థితులను గమనిస్తుండాలని సూచించారు.

అనంతరం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ,

మణుగూరు సబ్ డివిజన్ పరిధిలో గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు.కొండాయిగూడెం లోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద గణేష్ నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నామని చెప్పారు.సింగరేణి,మున్సిపాలిటీ, విద్యుత్ శాఖ,పంచాయతీ అధికారులు,జాలర్లతో సమన్వయం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిఐ నాగబాబు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్, విద్యుత్ శాఖ అధికారులు, సింగరేణి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

బోనకల్,సెప్టెంబర్ 17, (డీడీ9 వార్త):

విశ్వకర్మ జయంతి వేడుకలనుతెలంగాణ రాష్ట్రఖమ్మం జిల్లా, బోనకల్ మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్ల హనుమాన్ ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు రావుట్ల వెంకటాచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరణ చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పురోహితులు వజ్రాల రాధాకృష్ణమాచారి, మోడేపల్లి రామకోట చారి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.దేవతల శిల్పి, నిర్మాణకర్త, సృజనకు ప్రతీక అయినా విశ్వకర్మను ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో పూజించాలని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పంతంగి శ్రీనివాసచారి, మండల ప్రధాన కార్యదర్శి తాటికొండ విష్ణేశ్వర చారి, మండల గౌరవ అధ్యక్షులు చిట్యాల రాజయ్య చారి, మండల కార్యనిర్వహ కార్యదర్శి రావుట్ల లక్ష్మీనారాయణ చారి చిట్టినోజు సతీష్ చారి, సంఘ సభ్యులు బంగారు అప్పలాచారి, చిట్టోజు కృష్ణమాచారి నంచర్ల వీర బ్రహ్మచారి(చంటి)మోడేపల్లి శ్రీనివాస చారి రావుట్ల హరిచారి, రావుట్ల శివ చారి రామడుగు సైదాచారి,పంతంగి వీరభద్రా చారి, మోడేపల్లి కృష్ణమాచారి, తాటికొండ వెంకటేశ్వర్లు చారి తదితరులు పాల్గొన్నారు.



త్యాగాల స్ఫూర్తితో సమైక్యతను కాపాడుకుందాం....

- **జాతీయ సమైక్యతా దినోత్సవంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి.**

మెదక్ సెప్టెంబర్ 17 (ప్రజా స్వరం)

భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ దేశ సమైక్యతను మరింత బలోపేతం చేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, పార్టీ జెండాను కూడా ఎగరవేశారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాచరిక పాలన నుంచి తెలంగాణ ప్రజాస్వామిక వ్యవస్థలోకి అడుగుపెట్టిన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రజాస్వామిక స్వేచ్ఛ కోసం ఆనాడు తెలంగాణ సమాజం సాగించిన పోరాటం, యోధుల త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు.సమైక్యత అంటే సరిహద్దులు కలవడం మాత్రమే కాదు.. మనసులు కలవడం అని అన్నారు. ప్రజల మధ్య ఐక్యత, విభిన్న సంస్కృతుల మధ్య సామరస్యం, పరస్పర గౌరవం కొనసాగినప్పుడే దేశ సమైక్యత మరింత బలపడుతుందని చెప్పారు. భిన్నత్వంలో ఏకత్వమే భారత దేశ ప్రత్యేకత అని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ చాటిన సామరస్య విలువలు, జవహర్‌లాల్ నెహ్రూ కల్పించిన విశ్వాసం, మౌలానా అబుల్ కలాం ఆజాద్ పాదుకొల్పిన మతాతీత దేశభక్తి, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చాకచక్యంతో సంస్థానాల విలీనం జరిగి దేశం ఏకీకృతమైందని వివరించారు. ఆనాటి మహనీయుల స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్, మెదక్ జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు ఏం లావణ్య రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ. ఆంజనేయులు, కౌన్సిలర్ జుబేర్ అహ్మద్, మాజీ కౌన్సిలర్లు అంకం చంద్రకళ, మెంగాని విజయలక్ష్మి, భీమరి కిషోర్, మాయ మల్లేశం, మెదక్ & హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు ఎం. అంజగౌడ్,సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు,మాజీ సర్పంచ్ లు, మెదక్ పట్టణ,మండల నాయకులు,బిఆర్ఎస్వి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విమోచన దినోత్సవ వేడుకల్లో సరస్వతి ట్రస్ట్

తూప్రాన్ డి డి 9వార్త

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీలో విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని సరస్వతి ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ట్రస్ట్ అధ్యక్షులు లయన్ జానకిరామ్ గౌడ్ ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం జానకి రామ్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినోత్సవ చరిత్రను, నాటి పోరాటంలో పాల్గొన్న వీరుల త్యాగాలను స్మరించుకున్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, సామాజిక బాధ్యతలను ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలనిఆయన పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సరస్వతి ట్రస్ట్ సభ్యులు బొడ్డు శ్రీహరి అశోక్ గౌడ్ వెంకటనారాయణ బిజెపి నాయకులు కె.వేణుగోపాల్ బి. మామిడి వెంకటేష్ జానకి రామ్ మధుసూదన్ , స్థానికులు, యువత తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ పోస్టులపై అవినీతి ఆరోపణల కలకలం!

- **నియామకాల వెనుక 'ముడుపుల' మతలబేంటి?**
- **విద్యాశాఖ అధికారి పాత్రపై అనుమానాల మంటలు..**
- **అర్హత, మెరిట్‌ను పక్కనపెట్టి పోస్టుల పందేరమా?**
- **40 రోజులకే నియామకం మార్పు.. త్రిసభ్య కమిటీ నిబంధనలు పాటించారా?**
- **రికార్డులు బయటపెట్టాలని అభ్యర్థుల డిమాండ్!**

బోనకల్,సెప్టెంబర్ 17,(డీడీ9 వార్త):

బోనకల్ మండలంలో ప్రీ ప్రైమరీ బోధకుల నియామకాల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒకరికి నియామక ఉత్తర్వులు జారీ చేసి, సుమారు 40 రోజుల పాటు విధులు నిర్వహించిన అనంతరం అదే పోస్టుకు మరో అభ్యర్థికి అవకాశం కల్పించినట్లు వస్తున్న ఆరోపణలు ఇప్పుడు అధికారుల నిర్ణయాలపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.
అసలు ఎంపిక ప్రక్రియ ఎలా జరిగింది, నిజంగా అభ్యర్థుల అర్హతలను ఏ విధంగా పరిశీలించారు అనే అంశం వెలుగులోకి రావాలని కోరుతున్నారు,మెరిట్ ప్రాతిపదిక ఏమిటి?తుది ఎంపికలో ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయన్న ప్రశ్న తో పాటు,ఎంపిక జాబితాను ఎందుకు బహిరంగం చేయడం లేదనే ప్రశ్నలు ఆశావహుల నుంచి వినిపిస్తున్నాయి.
ముఖ్యంగా త్రిసభ్య కమిటీ నిబంధనల ప్రకారమే ఎంపిక ప్రక్రియ నిర్వహించిందా? కమిటీ తీసుకున్న నిర్ణయాలు రికార్డుల్లో ఉన్నాయా? ఒకసారి నియామక ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత వాటిని మార్చాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది?మార్పునకు అధికారిక కారణాలు ఏమిటి? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

'ముడుపుల'ఆరోపణలపై విచారణ ఏది?:

నియామకాల వెనుక ముడుపుల వ్యవహారం జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో వాటిపై కూడా సమగ్ర విచారణ జరపాలని బాధిత అభ్యర్థులు కోరుతున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలను అధికారులు పరిశీలించి వాస్తవాలను తేల్చాల్సి ఉంది. అవినీతి జరిగిందా? లేదా నియామకాలు నిబంధనల ప్రకారమే జరిగాయా? అన్నది అధికారిక విచారణతోనే స్పష్టమవుతుందని అభ్యర్థులు పేర్కొంటున్నారు.

విద్యాశాఖ అధికారి పాత్రపై ప్రశ్నలు:

ఈ మొత్తం వ్యవహారంలో మండల విద్యాశాఖ అధికారి పాత్ర ఎంతవరకు ఉంది? నియామక ప్రక్రియపై అధికారికి ఉన్న అధికార పరిధి ఎంత? కమిటీ నిర్ణయాలను అధికారులు ఎలా అమలు చేశారు? ఒకరి నియామకాన్ని మార్చడానికి ఏ నిబంధన ఆధారంగా నిర్ణయం తీసుకున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.
నియామకానికి సంబంధించిన దరఖాస్తులు, అర్హతల పరిశీలన, మెరిట్ జాబితా, త్రిసభ్య కమిటీ సమావేశ వివరాలు, ఎంపిక తీర్మానం, నియామక ఉత్తర్వులు, అనంతరం మార్పుకు సంబంధించిన ఉత్తర్వులు బహిర్గతం చేస్తే అనుమానాలకు తెరపడుతుందని అభ్యర్థులు అంటున్నారు.

గుట్టు విప్పాల్సిందే!:

నియామకాలపై వస్తున్న ఆరోపణలను తేలిగ్గా తీసుకోకుండా జిల్లా స్థాయి అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. అర్హత ఉన్న వారికి న్యాయం జరిగిందా లేదా మెరిట్ పాటించారా? కమిటీ సభ్యులు నిబంధనలు ఉల్లంఘించారా!అధికారుల నిర్ణయాల వెనుక ఏదైనా అక్రమ ప్రయోజనం ఉందా? అన్న ప్రతి అంశాన్ని రికార్డుల ఆధారంగా తేల్చాలని కోరుతున్నారు.
"నియామకాల్లో పారదర్శకత ఉంటే రికార్డులు బయటపెట్టడానికి అభ్యంతరం ఎందుకు?" అని ప్రశ్నిస్తున్న అభ్యర్థులు.. విద్యాశాఖలో నియామకాల గుట్టును సమగ్ర విచారణ ద్వారా విప్పాలని డిమాండ్ చేస్తున్నారు.




పట్టా భూమి అయితే నోటీసులు ఎందుకు..?

- **పట్టా భూమి అయితే నోటీసులు ఎందుకు..?**
- **గవర్నమెంట్ భూమి అంటూ సదానందానికి రెవెన్యూ నోటీసులిచ్చింది ..?**
- **పూటకో పార్టీ మార్చే నాయకుల ఒత్తిళ్లు, విలేకరిని బెదిరించడం దేనికి..?**
- **కఠిన చెర్యలు తీసుకోకుండా నోటీసులు ఇచ్చి వదిలేస్తారా..?**
- **నిజం తేల్చి బాధ్యులు పై ఎందుకు కేసు నమోదు చేయలేదు**
- **ఒక చోట అక్రమాన్ని ఉపేక్షిస్తే.. మరోచోట అదే ధోరణి పునరావృతమయ్యే ప్రమాదముందంటున్న ప్రజలు**
- **విషయం స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దృష్టికి వెళ్లిందా ..?**
- **తప్పు చేసిన వారు ఎవరైనా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా చూడాలి.**

శాయంపేట,సెప్టెంబర్ 17,డి డి 9వార్త

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పెద్దకోడేపాక గ్రామ శివారులోని భూమి వివాదం రోజురోజుకూ కొత్త మలుపు తిరుగుతోంది. భూమి తనదేనంటూ కొమ్ముల సదానందం తనను బెదిరింపులకు గురిచేస్తున్నారని బాధితురాలు రజిత సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది.బాధితురాలు అధికారులకు అందజేసిన ఫిర్యాదు, ఆమె వెల్లడించిన అంశాల ఆధారంగా 'నాడు నేడు' పత్రిక లో వార్త ప్రచురితమైంది.అయితే వార్త వెలువడిన అనంతరం పూటకో పార్టీ మార్చే ప్రస్తుతం అధికార పార్టీలో ఉన్న కొంతమంది నాయకులు విలేకరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డారు.''ఇది పట్టా భూమి.. కొమ్ముల సదానందానికి సంబంధించిన పట్టా భూమి... వాస్తవాలు తెలుసుకోకుండా ఎలా వార్త రాస్తావు...?'' అంటూ ముందుగా తమ అనుమతి తీసుకుని వార్త రాయాలని ఒత్తిడి తెచ్చారు.



పట్టా భూమి అయితే నోటీసులు ఎందుకు..?

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది.భూమి సదానందానికి చెందిన పట్టా భూమి అని కొంతమంది నాయకులు చెబుతున్నప్పుడు రెవెన్యూ అధికారులు ఆ భూమి ప్రభుత్వ భూమి అని పేర్కొంటూ సదానందానికి నోటీసులు ఎందుకు జారీ చేశారు..? నోటీసుల వెనుక ఉన్న రికార్డులు ఏమిటి..? భూమి వర్గీకరణ ఏమిటి.? సర్వే రికార్డులు ఏం చెబుతున్నాయి..? హక్కులు ఎవరికి ఉన్నాయి..? అనే విషయాలను అధికారులు పత్రికా ముఖంగా బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది.మరి ఎందుకు ఆగుతున్నారు. బాధితురాలి ఫిర్యాదు ఒకవైపు..భూమి తనదేనంటున్న సదానందం వాదన మరోవైపు. రెవెన్యూ అధికారులు జారీ చేసిన నోటీసులు మరోవైపు ఉండటంతో అసలు వాస్తవం ఏమిటన్నది ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.పట్టా భూమి అని వాదిస్తున్న వారు ఆ హక్కుకు సంబంధించిన రికార్డులు చూపించాలి..ప్రభుత్వ భూమి అని అధికారులు చెబుతున్నట్లయితే అందుకు సంబంధించిన రికార్డులను ప్రజల ముందు ఉంచాలి.

విలేకరిని బెదిరించడం వెనుక ఉద్దేశమేంటి..?

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు,వారి సమస్యలను వెలుగులోకి తీసుకురావడం మీడియా బాధ్యత. ఒక బాధితురాలు అధికారులను ఆశ్రయించి తన గోడును వెళ్లబోసుకున్నప్పుడు,ఆమె వాదనను వార్తగా ప్రచురించినందుకు విలేకరిపై ఒత్తిడి తీసుకురావడం,''ముందుగా మాకు చెప్పి..మా అనుమతితో వార్త రాయాలి''అంటూ హుకుం జారీ చేయడం దేనికి సంకేతమని భవిష్యత్తులో వారు పాల్పడే అక్రమాలకు వెలుగులోకి తీసుకురాకుండా ఉండడం కోసమేనా...? అంటూ సీనియర్ సిటిజన్లు ప్రశ్నిస్తున్నారు. వార్తలో వాస్తవం లేదని భావిస్తే ఆధారాలతో ఖండించాలి..కానీ విలేకరిని బెదిరించడం ఎందుకు..?అనే ప్రశ్నలు ఇప్పుడు మండలంలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.అధికార పార్టీకి చెందిన నాయకులు విలేకరిపై బెదిరింపులకు పాల్పడిన విషయం స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దృష్టికి వెళ్లిందా ..? వెళితే ఈ అంశంపై ఆయన స్పందన ఏమిటి..? అన్న ప్రశ్నలు కూడా ప్రజల్లో వినిపిస్తున్నాయి.ఎవరు తప్పు చేసినా మా ప్రభుత్వం ఉపేక్షించేది లేదని చెప్పిన ప్రజాప్రతినిధి తన పార్టీకి చెందిన నాయకులు ఇలాంటి ఘటనలకు పాల్పడితే వాస్తవాలు తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధిగా ఆయనపై ఉందని స్థానికులు అంటున్నారు.

నోటీసులు ఇచ్చి వదిలేస్తారా..?

రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయడంతోనే వ్యవహారాన్ని ముగించకుండా భూమికి సంబంధించిన పూర్తి రికార్డులను పరిశీలించి ,అవసరమైతే సర్వే నిర్వహించి అసలు హక్కుదారుడు ఎవరో తేల్చాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ భూమి అయితే ఆక్రమణకు పాల్పడినట్లు తేలిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని,ప్రైవేటు పట్టా భూమి అయితే రికార్డుల ఆధారంగా హక్కును స్పష్టం చేయాలని అంటున్నారు.ఒక చోట అక్రమాన్ని ఉపేక్షిస్తే.. మరోచోట అదే ధోరణి పునరావృతమయ్యే ప్రమాదం ఉంది.అధికార బలం,రాజకీయ పలుకుబడి లేదా ఆర్థిక ప్రభావంతో భూముల విషయంలో ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

నిజం తేలాలి.. బాధ్యులు తేలాలి..!

పెద్దకోడేపాక భూ వివాదంపై సమగ్ర విచారణ జరిపి భూమి ఎవరిది..? పట్టా భూమా..? ప్రభుత్వ భూమా..? నోటీసులు ఎందుకు ఇచ్చారు..? అనే ప్రశ్నలకు రెవెన్యూ అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే విలేకరిపై బెదిరింపులకు పాల్పడినవారిపై కూడా విచారణ జరిపి వాస్తవాలు తేల్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.భూమి వివాదం ఒక సమస్య అయితే.. నిజాన్ని వెలుగులోకి తీసుకువచ్చే విలేకరిని బెదిరించడం మరో సమస్య. రెండింటికీ నిష్పక్షపాత విచారణే పరిష్కారం.స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని సంబంధిత అధికారులతో సమగ్ర విచారణ జరిపించి, తప్పు చేసిన వారు ఎవరైనా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.రికార్డులు మాట్లాడాలి..అధికారులు నిజం చెప్పాలి..బెదిరింపులకు కాదు, చట్టానికి విలువ ఉండాలి.అప్పుడే ప్రజల్లో పాలనా వ్యవస్థపై నమ్మకం నిలుస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు.

కాళ్లకల్ బంగారమ్మ ఆలయంలో బీజేపీ నాయకుల పూజలు

డి డి 9వార్త , మనోహరాబాద్ :

భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ (బిజెపి) మనోహరాబాద్ మండల శాఖ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్,సేవా సంకల్ప అభియాన్ కన్వీనర్ కొల్తూరి నరేష్ గౌడ్ గారి ఆధ్వర్యంలో కాళ్లకల్ గ్రామంలోని ప్రసిద్ధ బంగారమ్మ ఆలయంలో బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు, కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ
దేశ సేవకే అంకితం: దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తున్న నాయకుడు నరేంద్ర మోడీ అని, ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కాళ్లకల్ బంగారమ్మ తల్లిని వేడుకున్నట్లు తెలిపారు.



సుపరిపాలన సంక్షేమం వంటి కార్యక్రమాలు మోడీ నాయకత్వంలో భారతదేశం ఆర్థికంగా, సాంకేతికంగా ముందుకు దూసుకుపోతోందని, పేదల సంక్షేమానికి ఆయన అమలు చేస్తున్న పథకాలు ప్రతి ఇంటా వెలుగులు నింపుతున్నాయని కొనియాడారు.
ప్రధాని పుట్టినరోజును పురస్కరించుకుని స్వచ్ఛతా కార్యక్రమాలు, మొక్కలు నాటడం మరియు పేదలకు పండ్లు పంపిణీ వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను మండలంలో చేపడుతున్నట్లు చెప్పారు.
ఈ పూజా కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు కమ్మరి నరేందర్ చారి, ఎల్ ప్రభాకర్ గౌడ్, కూచారం ఉప సర్పంచ్ మజ్జతి ఆంజనేయులు, నర్సింలు ముదిరాజ్, ఎర్ర కృష్ణ, నారం రాజు, ఆనంద్ యాదవ్, రమేష్, రచ్చ శ్రీకాంత్, పరం నరేష్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అల్లు అర్జున్ 'రాకా' నుంచి క్రేజీ అప్‌డేట్..

గత కొన్ని నెలలుగా సైలెంట్‌గా షూటింగ్ జరుపుకుంటున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా మూవీ 'రాకా' నుండి ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజింగ్ అప్డేట్ వచ్చింది. టాలెంటెడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం నుంచి అప్డేట్స్ రావడం లేదని నిన్నటి వరకు ఫీలయ్యారు ఫ్యాన్స్.. దీంతో నేడు ఓ నెంబర్ పోస్టర్ వదలి.. దాన్ని ఎనలైజ్ చేయమని ఫ్యాన్స్ కే పరీక్ష పెట్టారు టీమ్. 'మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోండి' అనే ట్యాగ్ లైన్‌తో తాజాగా కేవలం '37' అనే సంఖ్య మాత్రమే ఉన్న ఒక విలక్షణమైన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మిస్టరీ నంబర్ పోస్టర్ ఇప్పుడు అల్లు అర్జున్ అభిమానులతో పాటు సినిమా లవర్స్‌ను సైతం ఆకర్షిస్తుంది. అసలు ఆ '37' కి అర్థం ఏంటా అని నెటిజన్లు జుట్టు పీక్కుంటున్నారు. దీనిపై రకరకాల ఊహాగణాలు వినిపిస్తుండగా.. మొత్తానికి ఆ '37' వెనుక ఉన్న అసలు రహస్యం ఏంటనేది త్వరలోనే వెల్లడి కానున్నది. ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో గ్లోబల్ బ్యూటీ దీపికా పడుకోనే హీరోయిన్‌గా నటిస్తుండగా.. యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ సంగీతాన్ని అందిస్తున్నాడు.



స్పెషల్ సాంగ్‌లో డింపుల్.. వెంకీ మామా సినిమా నుంచి క్రేజీ అప్డేట్

విక్టరీ వెంకటేష్ హీరోగా, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'ఆదర్శకుటుంబం'. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న ఈ చిత్రం అక్టోబర్ 2న రిలీజ్ కాబోతున్నది. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ప్రతీ అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోగా.. తాజాగా వచ్చిన టీజర్‌తో సినిమాలో ఉన్న కామెడీ యాంగిల్‌ను పరిచయం చేశారు మేకర్స్. సాధారణ బ్యాంక్ ఎంప్లాయ్‌గా ఉండే వెంకీ.. తన భార్య అప్పుల బాధ తట్టుకోలేక విలవిల్లాడతాడు. అలాంటి వ్యక్తికి లాడరీ తగిలితే ఎలా ఉంటుంది అనే యాంగిల్‌కు కామెడీ జోడించి అద్భుతంగా ప్రజెంట్ చేశాడు త్రివిక్రమ్. ఈ క్రమంలోనే ఈ సినిమాకు సంబంధించి తాజాగా మరో క్రేజీ అప్డేట్ నెట్టింట దర్శనమిచ్చింది. ఈ మూవీలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా.. నారా రోహిత్, నివేథా పేతురాజ్, యువినా పార్థవి, రాజా ప్రైవల్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ ప్రాజెక్టులో క్రేజీ అండ్ బోల్డ్ బ్యూటీ డింపుల్ హయాతి కూడా భాగం అయినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా.. ఈ మూవీలో ఓ స్పెషల్ సాంగ్ కూడా ఉండబోతుండగా.. అందులో డింపుల్‌తో పాటు నివేథా పేతురాజ్ కూడా కనిపించనున్నారని తెలుస్తోంది. అయితే.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



వచ్చే ఏడాదిలో 'జి2'

అడివి శేష్ కథానాయకుడిగా నటిస్తున్న 'జి2' వచ్చే ఏడాది ఫిబ్రవరి 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. విజయవంతమైన 'గూఢచారి'కి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రమిది. వినయ్‌కుమార్ సిరిగినీడి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. వామికాగబ్బి కథానాయిక. టి.జి.విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మాతలు. ఇమ్రాన్ హష్మీ, మురళీశర్మ, మధుశాలిని కీలక పాత్రలు పోషిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రూపొందుతున్న ఈ సినిమా విడుదల తేదీని బుధవారం ప్రకటించారు నిర్మాతలు. తెలుగుతోపాటు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు తెలిపారు.



వచ్చే ఏడాదిలో 'జి2'

సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' (Toxic Movie). యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా గురించి యశ్ మాట్లాడుతూ ఇది కేవలం పెద్దవాళ్ల సినిమా అని స్పష్టం చేశారు. ''పిల్లలు ఈ సినిమా చూడొద్దు. ఇది పెద్దల కోసం మాత్రమే తీశాం. ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాను. పెద్దలకు తప్పొప్పులు తెలుసు. వాళ్లు ఈ సినిమా నుంచి ఏం నేర్చుకోవాలో నిర్ణయించుకుంటారు. జీవితంలో ఏం చేయాలి, ఏం చేయకూడదనే విచక్షణ వారికి ఉంటుంది. అందుకే వాళ్ల కోసమే చాలా నిజాయతీగా ఈ చిత్రం రూపొందించాం'' అని చెప్పారు.



ఇందులోని అశ్లీల సన్నివేశాల గురించి యశ్ (Yash) మాట్లాడారు. విమర్శలను తోసిపుచ్చారు. 'ఈ చిత్రం మిమ్మల్ని ఆలోచింపచేస్తుంది. కథ నిర్దిష్టమైన దిశకు చేరుకోవాలంటే ప్రతి పాత్రలోని వేర్వేరు పొరలను ఆవిష్కరించడం చాలా ముఖ్యం. ట్రైలర్, పాటలపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అవి కేవలం రెండు పాత్రల మధ్య ప్రేమను ఆవిష్కరించే సన్నివేశాలు మాత్రమే. వాటిని అలా మాత్రమే చూడండి. గీతూ మోహన్‌దాస్ ఒక దర్శకురాలు.. మహిళలకు కూడా భావోద్వేగాలు పంచుకునే హక్కు ఉంటుంది. కేవలం పబ్లిసిటీ కోసం కాకుండా, కథలోని ప్రాధాన్యతను బట్టే ఆయా సన్నివేశాలు చిత్రీకరించాం'' అని యశ్ అన్నారు.

మనకు మనమే శత్రువులం

మనం
ఎదుగుతుంటే పక్కవారు
చూడలేరంటూ ఓ ఇన్‌ఫ్లూయెన్సర్ పెట్టిన
పోస్ట్‌కు నటి శోభితా ధూళిపాళ్ల (Sobhita Dhulipala) మద్దతు
తెలిపారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే శోభితా.. తాజాగా ఒక పోస్ట్‌కు ఇచ్చిన రిప్లై వైరల్ అవుతోంది. 'మనకు మనమే శత్రువులం' అని తెలుగు వాళ్లను ఉద్దేశించి పెట్టిన వీడియోకు.. ఈ నటి 100 శాతం కరెక్ట్ అంటూ ఎమోజీతో రిప్లై పెట్టారు. ఈ సందర్భంగా తాను ఇండస్ట్రీకి రావాలనుకున్న రోజులను, అప్పుడు తనకు ఎదురైన అనుభవాలను శోభిత పంచుకున్నారు.
"16 ఏళ్ల వయసులోనే నా బ్యాగులు సర్దుకుని ముంబయికి వెళ్లిపోయా. నేను కచ్చితంగా ఈ రంగంలో రాణిస్తాననే నమ్మకం లేదు. అయినా.. ధైర్యంగా అడుగు ముందుకు వేశా. ఎందుకంటే మన సమాజంలో చాలా వరకూ కలలు కనేవారిని, ముఖ్యంగా కొత్తరంగంలోకి అడుగుపెట్టాలనుకునే వారిని ప్రోత్సహించరు. మనం కొత్తగా ఏదైనా పని మొదలు పెడితే.. అప్పటికే ఆ రంగంలో ఉన్నవాళ్లు మనకు మద్దతు ఇవ్వరు. ఈ విషయం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఇక, ఇలాంటి నూతన అడుగు వేసేది మహిళ అయితే.. ప్రతికూల పరిస్థితులు రెట్టింపు అవుతాయి" అని శోభిత తన రిప్లైలో రాసుకొచ్చారు.
దావూద్ ఇబ్రహీంతో ఫొటో.. నా కెరీర్‌ను దెబ్బతీసింది: నటి
అయితే.. ఇదంతా ఒకప్పటి పరిస్థితి అని శోభిత స్పష్టం చేశారు. "ఇది చాలా కాలం క్రితం జరిగింది. ఇప్పుడు పరిస్థితులు మారాయని ఆశిస్తున్నా. మన సమాజంలో అందరూ ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగాలి. ఇతరులపై ఆధారపడకుండా మీ కోసం మీరు నిలబడేంత మానసిక బలాన్ని పెంపొందించుకోవాలి" అని సూచించారు. 2016లో ఓ హిందీ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన శోభితా.. గూఢచారి సినిమాలో సమీరాగా మెప్పించారు. మేజర్, పొన్నియన్ సెల్వన్‌లలో నటించారు. ఒకవైపు సినిమాలు చేస్తూనే వెబ్ సిరీస్‌లతో ఆకట్టుకుంటున్నారు.

నా ప్రపంచాన్ని మీ అందరికి పరిచయం చేయబోతున్నా అంటూ అప్డేట్ ఇచ్చిన దుల్కర్ సల్మాన్

బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో సందడి చేస్తున్న మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఆకాశంలో ఒక తార'. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన అప్డేట్స్ సినిమాపై అంచనాలను పెంచగా.. తాజాగా విడుదల తేదీని ప్రకటించాడు దుల్కర్. ఈ మేరకు ఓ స్పెషల్ పోస్టర్‌ను షేర్ చేస్తూ.. 'ఇప్పటివరకు ఈ ప్రయాణం ఎంతో అద్భుతంగా సాగింది.. నవంబర్ 20న ఈ ప్రపంచాన్ని మీ అందరికీ పరిచయం చేయడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను.. మీ, కృష్ణ' అంటూ సినిమా నవంబర్ 20న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నట్లు ప్రకటించాడు. కాగా.. అంతరిక్షంలోకి వెళ్లాలని పెద్ద కలలు కనే ఒక గ్రామీణ అమ్మాయి కథాంశంతో ఈ చిత్రాన్ని ఎంతో ఆసక్తికరంగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని సందీప్ గున్నం, రమ్మ గున్నం లైట్ బాక్స్ మీడియా బ్యానర్‌పై నిర్మిస్తుండగా.. పవన్ సాధినేని దర్శకత్వం వహిస్తున్నాడు. సాత్విక వీరపల్లి హీరోయిన్. జి.వి ప్రకాష్ కుమార్ అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నాడు.

మనం 2026లో ఉన్నాం..

బోనాల సమయంలో తాను ఎదుర్కొన్న విమర్శల గురించి నటి ఫరియా అబ్దుల్లా (Faria Abdullah) మరోసారి స్పందించారు. ఆమె తాజా చిత్రం 'సిగ్మా' విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఈ విషయం గురించి మాట్లాడారు. సోషల్ మీడియాలో ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయన్నారు.
"ఇటీవల సోషల్ మీడియాలో నాపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అదే వేదికగా నేను కూడా ఆ వివాదంపై నా అభిప్రాయాన్ని తెలియజేశాను. అయితే, ఒక విషయం మాత్రం నన్ను వెంటాడింది. మనం 2026లో జీవిస్తున్నాం. కానీ, ఇంకా చాలామంది పాతకాలం వాళ్లలా ఆలోచిస్తున్నారు. ఆ సమయంలో కొందరి భావజాలం బాధించింది. నేనెప్పుడూ అభ్యుదయ భావాలతో ఆలోచిస్తాను. నా పద్ధతులు నచ్చిన వాళ్లు అనుసరిస్తారు. నచ్చని వాళ్లు విమర్శిస్తారు. ఎవరి అభిప్రాయాలు వాళ్లకు ఉంటాయి. అందరి ఆలోచనలను నేను గౌరవిస్తాను" అని చెప్పారు.
ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బోనాల సందడిలో ఫరియా అబ్దుల్లా.. పోతురాజుతో కలిసి నృత్యం చేశారు. ఆమె ఈ పండగ చేసుకోవడంపై కొందరు మతం పేరుతో విమర్శించారు. వీటిని ఖండించిన ఫరియా సోషల్ మీడియా వేదికగా నాడు వీడియో విడుదల చేశారు. తాను అంతటా భగవంతుడిని చూస్తానని అన్నారు.
ఇక, సిగ్మా విషయానికొస్తే.. తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ కథానాయకుడు విజయ్ కుమారుడైన జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రమిది. సందీప్‌కిషన్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.